News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in : www.cknewstv.in

# CK NEWS
చంద్రకాంత్
తెలుగు దినపత్రిక

Website cknewstv.in

సంపుటి : 03 | సంచిక :173 | ఖమ్మం | గురువారం, ఆగస్టు 7, 2025 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

## పారితోషికం ఎంత.. ఎలా... తీసుకున్నారు?

- సినీ నటుడు విజయ్ దేవరకొండను ప్రశ్నించిన ఈడీ
- గేమింగ్ యాప్‌కే ప్రచారం చేశానన్న నటుడు



ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల వ్యవహారంపై మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ముందుకు సినీనటులు వరుస కడుతున్నారు. ఇటీవలే ప్రకాశ్‌రాజ్ విచారణకు రాగా, బుధవారం విజయ్ దేవరకొండ వంతయింది. బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయానికి ఉదయం 10.40 గంటలకు వచ్చిన విజయ్‌ను వివరాలు 2లో..

## యూరియా కొరత తీర్చండి..

- పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని పెంచండి
- కేంద్ర మంత్రులు జేపీనడ్డా, నిర్మలాసీతారామన్‌లకు రాష్ట్ర మంత్రి తుమ్మల వినతి



తెలంగాణ రైతులు ఎదుర్కొంటున్న రెండు ప్రధాన సమస్యలను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం ఇద్దరు కేంద్రమంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. యూరియా కొరత తీర్చాలని కేంద్ర ఎరువులు, రసాయనాల వివరాలు 2లో..



# మేం ఢిల్లీకి రాం

## మిమ్మల్ని గల్లీలోనే పట్టుకుంటం

## 42% బీసీ రిజర్వేషన్లు సాధించుకుంటం

### దిగి రాకుంటే.. దిగిపోవాల్సిందే..

- బీసీ బిల్లులకు తక్షణం ఆమోదం తెలపండి..
- తెలంగాణ పోరాట స్ఫూర్తిని తక్కువ అంచనా వేయొద్దు
- ఢిల్లీలో బీసీ రిజర్వేషన్ల ధర్నాలో.. ప్రధాని మోదీపై సీఎం రేవంత్ వ్యాఖ్యలు
- బీసీ రిజర్వేషన్లకు అడ్డుపడుతున్నారంటూ భారత రాష్ట్ర సమితి , భాజపా నేతలపై ఆరోపణలు
- 'ఎక్స్' వేదికగా ధర్నాకు మద్దతు పలికిన ఖర్గే, రాహుల్, ప్రియాంక
- హాజరై సంఘీభావం తెలిపిన ఇండియా కూటమి ఎంపీలు
- పాల్గొన్న రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

మేం గుజరాత్ నుంచి గుంట భూమి కూడా అడగలేదు. మా గడ్డమీద.. మా బలహీనవర్గాల సోదరులకు 42% రిజర్వేషన్లు ఇచ్చుకుంటామంటే గుజరాత్ వాళ్లకు కడుపుమంట ఎందుకు?" అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రధాని మోదీని ప్రశ్నించారు. విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లపై అసెంబ్లీలో చేసిన బిల్లులు, ఆర్డినెన్స్‌కు రాష్ట్రపతి వెంటనే ఆమోదం తెలపాలన్న డిమాండ్‌తో కాంగ్రెస్ బుధవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో నిర్వహించిన భారీ ధర్నాలో రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. 'తెలంగాణలో 4 కోట్ల ప్రజల అభీష్టం మేరకు శాసనసభలో ఆమోదించి బలహీనవర్గాలకు 42% రిజర్వేషన్లు ఇవ్వాలని ముక్తకంఠంతో విజ్ఞప్తి చేశాం. మా ఆలోచనలు, మా బిల్లులను తుంగలో తొక్కే అధికారం మీకెవరిచ్చారు? మీకున్నవి రెండే మార్గాలు. 42% రిజర్వేషన్ల బిల్లులకు ఆమోదించడం.. లేదంటే ప్రధానమంత్రి వివరాలు 2లో..

## గాంధీ కుటుంబాన్ని పొగడటానికే కాంగ్రెస్ ధర్నా

- రేవంత్‌రెడ్డి ప్రసంగంలో రాహుల్, సోనియా జపమే ఎక్కువ
- వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ఢిల్లీలో పగటివేషాలు
- మతపరమైన రిజర్వేషన్లను అంగీకరించబోం: కిషన్‌రెడ్డి



ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన ధర్నా కార్యక్రమం గాంధీ కుటుంబాన్ని పొగడటానికే సరిపోయిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. రాజకీయంగా ఎదురవుతున్న ఒత్తిళ్లను తట్టుకోవడానికి గాంధీ కుటుంబం అనుగ్రహమే శరణ్యమన్న లక్ష్యంతో రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమం నిర్వహించినట్లు స్పష్టమవుతోందన్నారు.ఆయన ప్రసంగంలో సగం సమయం రాహుల్, సోనియా జపం చేశారని విమర్శించారు. ఈమేరకు బుధవారం సాయంత్రం కిషన్‌రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. "42% బీసీ రిజర్వేషన్ల హామీని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత కాంగ్రెస్‌దే. అందుకోసం న్యాయ, చట్టపరమైన అంశాలపై దృష్టి సారించి చిత్తశుద్ధితో పనిచేయాలి తప్ప బట్టకాల్చి భాజపాపై వేస్తామంటే ఊరుకోం. రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతోంది. కోర్టు ఆదేశాల ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలు పెట్టాలి. కానీ, ఎన్నికలు నిర్వహిస్తే ప్రజాక్షేత్రంలో వ్యతిరేకత బయటపడుతుందని గ్రహించి రిజర్వేషన్ల పేరుతో డ్రామాలు ఆడుతున్నారు. అంతే తప్ప ఆయనకు బీసీలకు సాధికారత కల్పించే ఉద్దేశం లేదు. హైదరాబాద్‌లో ధర్నా చేస్తే ఎవరూ పట్టించుకోరని ఢిల్లీకొచ్చి పగటివేషాలు వేస్తున్నారు. బీసీల సంక్షేమానికి ఐదేళ్లలో రూ.లక్ష కోట్లు ఇస్తామని కామారెడ్డి డిక్లరేషన్‌లో చెప్పారు. దీని ప్రకారం ఇప్పటికే రూ.40 వేల కోట్లు ఇవ్వాల్సి ఉన్నా ఒక్క వివరాలు 2లో..

## బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తేనే మద్దతు

### ముస్లింలకు లబ్ధి చేకూర్చేందుకు రేవంత్‌రెడ్డి కుట్ర

### కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్



కాంగ్రెస్ పార్టీ ముస్లింలకు 10% రిజర్వేషన్లు కల్పించేందుకే ఢిల్లీలో ధర్నా చేస్తోందని, బీసీల కోసం కాదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శించారు. కామారెడ్డి డిక్లరేషన్ బీసీల కోసం కాదని, ముస్లిం రిజర్వేషన్ల కోసమని ఆరోపించారు. బీసీలకు మొత్తంగా 42% రిజర్వేషన్లు అమలు చేస్తేనే మద్దతిస్తామని ఆయన బుధవారం ఓ ప్రకటనలో స్పష్టంచేశారు. "బీసీలకు 5% రిజర్వేషన్లు పెంచి, ముస్లింలకు అదనంగా మరో 10% రిజర్వేషన్లు కల్పించేందుకు కాంగ్రెస్ కుట్ర చేస్తోంది. ఆ పార్టీ ధర్నాకు బీసీల మద్దతు కరవైంది. బీసీలకు ఏ పార్టీ ఏం చేసిందో బహిరంగ చర్చకు సిద్ధం. రాష్ట్ర జనాభాలో సగం మంది వివరాలు 2లో..

## డైపర్లు మార్చినట్లు.. పార్టీలు మార్చేస్తున్నారు



- రాజకీయాల్లో విలువలు, సంప్రదాయాలు తగ్గిపోయాయి
- 'నమో భారతీయం'ఆత్మీయ సభలో వెంకయ్యనాయుడు

'రాజకీయాల్లో విలువలు, సంప్రదాయాలు తగ్గిపోయాయి. ఏ నాయకులు ఏ పార్టీలో ఉంటారో అర్థం కావడం లేదు. పార్టీ సిద్ధాంతాలు నచ్చకపోతేనో, అధినేత నియంతలా వ్యవహరిస్తేనో పార్టీ మారారంటే అర్థం ఉంటుంది. కానీ చిన్నపిల్లల డైపర్లు మార్చినట్లు.. వివరాలు 2లో..



## ఢిల్లీలో కొత్త పరిపాలనా సౌధం..

### 'కర్తవ్య భవన్'ను ప్రారంభించిన ప్రధాని మోదీ

- ఢిల్లీలోని కర్తవ్య పథ్‌లో 'కర్తవ్య భవన్-03'ను ప్రారంభించిన ప్రధాని మోదీ
- ఏటా అద్దెల రూపంలో చెల్లిస్తున్న రూ. 1,500 కోట్లు ఆదా అవుతుందని వెల్లడి
- ఒకేచోటకు ఏడు కీలక మంత్రిత్వ శాఖల తరలింపుతో సమన్వయం సులభతరం
- అత్యాధునిక భద్రత, పర్యావరణ హిత ఫీచర్లతో భవనం నిర్మాణం

వివరాలు 2లో..

దేశ రాజధాని ఢిల్లీలో పరిపాలనా సంస్కరణలకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. చెల్లాచెదురుగా ఉన్న మంత్రిత్వ శాఖలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తెస్తూ, సెంట్రల్ విస్టా పునరాభివృద్ధి ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన 'కర్తవ్య భవన్-03'ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కొత్త సమీకృత పరిపాలనా సముదాయం వల్ల ప్రభుత్వానికి ఏటా అద్దెల రూపంలో ఖర్చయ్యే రూ. 1,500 కోట్ల ప్రజాధనం ఆదా అవుతుందని స్పష్టం చేశారు.


## కేసీఆర్ చెప్పినట్టుగానే జాగృతి ముందుకెళ్లింది

- బీసీల కోసం జాగృతి తరఫున అనేక పోరాటాలు నిర్వహించబోతున్నామన్న కవిత
- బీసీలను కాంగ్రెస్, బీజేపీ మోసం చేస్తున్నాయని మండిపాటు
- అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని డిమాండ్

వివరాలు 2లో..



## లిక్కర్ కేసు గురించి ఎవరూ మాట్లాడొద్దు



- లిక్కర్ కేసును సిట్ విచారిస్తోందన్న చంద్రబాబు
- కేసు గురించి కానీ, అరెస్టుల గురించి కానీ మాట్లాడొద్దని ఆదేశం
- కూటమి ఎమ్మెల్యేలంతా క్షేత్ర స్థాయిలోకి వెళ్లాలన్న ముఖ్యమంత్రి

ఏపీ మంత్రులకు ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక హెచ్చరిక జారీ చేశారు. లిక్కర్ కేసుపై కానీ, ఈ కేసులో జరుగుతున్న అరెస్టులపై కానీ మంత్రులు ఎవరూ మాట్లాడవద్దని హెచ్చరించారు. వివరాలు 2లో..

## లిక్కర్ స్కాం సొమ్ముతో హీరోయిన్లతో కలిసి ఫ్లైట్లలో తిరిగారు

- వైసీపీ నేతలు మద్యం సొమ్ముతో రాజభోగాలు అనుభవించారన్న ఆనం
- వెంకటేశ్ నాయుడు హీరోయిన్లతో కలిసి ఫ్లైట్లలో తిరిగారని వెల్లడి
- లిక్కర్ స్కామ్‌కు విజయసాయిరెడ్డే అసలు సూత్రధారి అని స్పష్టీకరణ
- స్కామ్‌తో సంబంధమున్న నేతలతో బంధుత్వం లేదని జగన్ చెప్పగలరా? అని సవాల్

వివరాలు 2లో..



# గాంధీ కుటుంబాన్ని పొగడటానికే కాంగ్రెస్ ధర్నా

- మొదటి పేజీ తరువాయి

రూపాయీ ఇవ్వలేదు. ఏ ఒక్క బీసీ వర్గాన్ని వదలకుండా అందరినీ నిట్టనిలువునా మోసం చేశారు. పాలనాపరంగా, రాజకీయంగా, ఆర్థికపరంగా ఎదురవుతున్న వైఫల్యాలు బయటపడుతుండటంతో వాటినుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు రేవంత్‌రెడ్డి ప్రయత్నం చేస్తున్నారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల సీట్లలో ముస్లింలు పోటీ చేసి... 50 రిజర్వుడ్ సీట్లలో 31 చోట్ల గెలిచారు. ఇప్పుడు అధికారికంగా 10% ముస్లింలను బీసీల్లో చేర్చి... 42% రిజర్వేషన్ అమలు చేస్తే బీసీలకు రాజ్యాధికారం ఎలా దక్కుతుందో రేవంత్‌రెడ్డి చెప్పాలి. అశాస్త్రీయమైన సర్వే ద్వారా బీసీల సంఖ్యను తగ్గించడంతోపాటు అందులో 10% ముస్లింలను చేర్చి బీసీలను రెండు విధాలా మోసం చేస్తున్నారు. రాజ్యాంగవిరుద్ధ మతపరమైన రిజర్వేషన్లను భాజపా అడ్డుకుని తీరుతుంది. ముస్లింలతో కూడిన బీసీ రిజర్వేషన్లను మేం అంగీకరించం. నరేంద్ర మోదీని విమర్శిస్తే.. అది ఆకాశం మీద ఉమ్మేయడమేనని రేవంత్‌రెడ్డి గుర్తించాలి' అని కిషన్‌రెడ్డి హితవు పలికారు.

# ఢిల్లీలో కొత్త పరిపాలనా సౌధం.. 'కర్తవ్య భవన్'ను ప్రారంభించిన ప్రధాని మోదీ

- మొదటి పేజీ తరువాయి

**అద్దె భవనాలకు స్వస్తి.. పెరగనున్న సామర్థ్యం**

ప్రస్తుతం ఢిల్లీలో పలు కీలక మంత్రిత్వ శాఖలు దశాబ్దాల క్రితం నిర్మించిన శాస్త్రి భవన్, కృషి భవన్, ఉద్యోగ్ భవన్ వంటి పాత భవనాల్లో, మరికొన్ని అద్దె భవనాల్లో పనిచేస్తున్నాయని ప్రధాని గుర్తుచేశారు. "వివిధ కార్యాలయాలు చెల్లాచెదురుగా ఉండటంతో దాదాపు 8,000 నుంచి 10,000 మంది ప్రభుత్వ ఉద్యోగులు పనుల నిమిత్తం రోజూ ప్రయాణించాల్సి వస్తోంది. ఇది ట్రాఫిక్ రద్దీకి, ఇంధన ఖర్చులకు కారణమవడమే కాకుండా, పని సామర్థ్యాన్ని కూడా తగ్గిస్తోంది. కర్తవ్య భవన్ నిర్మాణంతో ఈ సమస్యకు పరిష్కారం లభించింది" అని ప్రధాని వివరించారు. ఈ కొత్త భవనం ప్రజానుకూలం, పర్యావరణ అనుకూలం అని ఆయన అభివర్ణించారు.

**ఒకేచోట ఏడు కీలక మంత్రిత్వ శాఖలు**

కర్తవ్య పథ్‌లో నిర్మించిన ఈ భవనంతో పాలనలో వేగం, మంత్రిత్వ శాఖల మధ్య సమన్వయం పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. సుమారు 1.5 లక్షల చదరపు మీటర్ల విస్తీర్ణంలో, రెండు బేస్‌మెంట్లు, ఏడు అంతస్తులతో (గ్రౌండ్ + 6) ఈ భవనాన్ని నిర్మించారు. ఇందులో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ, విదేశీ వ్యవహారాలు, గ్రామీణాభివృద్ధి, ఎంఎస్ఎంఈ, సిబ్బంది-శిక్షణ (%ఐశీు%), పెట్రోలియం-సహజ వాయువు, ప్రధాన శాస్త్రీయ సలహాదారు (%ూూూ%) కార్యాలయాలు కొలువుదీరనున్నాయి.

**అత్యాధునిక, పర్యావరణ హిత నిర్మాణం**

కర్తవ్య భవన్ నిర్మాణంలో అత్యాధునిక టెక్నాలజీతో పాటు పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేశారు.

సాధారణ భవనాలతో పోలిస్తే 30 శాతం తక్కువ విద్యుత్‌ను వినియోగించేలా డిజైన్ చేశారు.

భవనం లోపల ఉష్ణోగ్రతను నియంత్రించి, బయటి శబ్దాలను తగ్గించేందుకు డబుల్ గ్లేజ్డ్ ఫ్యాసేడ్ విండోలను అమర్చారు.

ఆక్యుపెన్సీ సెన్సర్లతో కూడిన ఎల్‌ఈడీ లైటింగ్, విద్యుత్ ఆదా చేసే స్మార్ట్ లిఫ్టులు ఏర్పాటు చేశారు.

భవనం పైకప్పుపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా ఏటా 5.34 లక్షల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది.

జీరో డిశ్చార్జ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ విధానాన్ని అనుసరిస్తున్నారు. వ్యర్థ జలాలను శుద్ధి చేసి తిరిగి వినియోగిస్తారు. నిర్మాణంలో కూడా రీసైకిల్ చేసిన వ్యర్థాలను వాడారు.

ఐడీ కార్డు ఆధారిత ప్రవేశాలు, ఇంటిగ్రేటెడ్ ఎలక్ట్రానిక్ నిఘా, సెంట్రలైజ్డ్ కమాండ్ సిస్టమ్‌తో భద్రతను కట్టుదిట్టం చేశారు.

**ఇవి పాలనా దేవాలయాలు: ప్రధాని మోదీ**

ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. ఆగస్టు నెల విప్లవాల మాసమని అన్నారు. "గత కొన్నేళ్లుగా రాజధానిలో నిర్మించిన నూతన పార్లమెంట్ భవనం, భారత్ మండపం, జాతీయ యుద్ధ స్మారకం, యశోభూమి కన్వెన్షన్ సెంటర్ల సరసన ఇప్పుడు కర్తవ్య భవన్ కూడా చేరింది. ఇవి సాధారణ కట్టడాలు కావు, వికసిత భారత్ భవిష్యత్తును తీర్చిదిద్దే పాలనా దేవాలయాలు" అని ఆయన పేర్కొన్నారు. 21వ శతాబ్దపు భారతదేశానికి పాతకాలపు పనివిధానాలు సరిపోవని, అందుకే ఈ పరివర్తన అత్యవసరమని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

# లిక్కర్ స్కాం సొమ్ముతో హీరోయిన్లతో కలిసి ఫ్లైట్లలో తిరిగారు

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో భారీ లిక్కర్ స్కామ్ జరిగిందని, ఆ కుంభకోణం ద్వారా వచ్చిన డబ్బుతో ఆ పార్టీ నేతలు విలాసవంతమైన జీవితం గడిపారని టీడీపీ అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. గొట్టిపాటి వెంకటేశ్ నాయుడు అనే వ్యక్తి స్కామ్ సొమ్ముతో హీరోయిన్లతో కలిసి ప్రత్యేక విమానాల్లో జల్సాలు చేశారని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, వైసీపీ నేతలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా ఆనం మాట్లాడుతూ, లిక్కర్ స్కామ్‌లో కీలక పాత్ర పోషించిన వ్యక్తులంతా మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి బంధువులు, సన్నిహితులేనని ఆరోపించారు. "రాజకాశిరెడ్డి ఎవరో తెలియదని, ఆయన వైఎస్ సుజాతారెడ్డికి అల్లుడు కాదని జగన్ చెప్పగలరా? రాజకాశిరెడ్డి, ముప్పిడి అవినాష్ రెడ్డి బంధువులు కాదా? చంద్రగిరికి చెందిన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మిథున్ రెడ్డి వంటి వారితో తమకు ఎలాంటి సంబంధం లేదని జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించే ధైర్యం ఉందా?" అని ఆనం సవాల్ విసిరారు. వైసీపీ నేతలను ఈ విషయంపై ప్రశ్నిస్తే, తమకు ఏమీ తెలియదని, స్కామే జరగలేదని చెప్పడం వారి ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు.

ఈ మొత్తం లిక్కర్ స్కామ్‌కు సూత్రధారి, కింగ్‌పిన్ వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డేనని ఆనం వెంకటరమణారెడ్డి ఆరోపించారు. జగన్‌మోహన్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడైన విజయసాయిరెడ్డే ఈ వ్యవహారాన్ని ముందుండి నడిపించారని అన్నారు. "ఆ పొట్టోడిని నమ్మొద్దని, నమ్మితే సంకనాకిపోతారని నేను ముందే చెప్పాను" అంటూ తన పాత వ్యాఖ్యలను గుర్తుచేశారు. ఇటీవల విజయసాయిరెడ్డి మాట్లాడుతూ, "లిక్కర్ స్కామ్ జరిగింది కానీ, తనకు సంబంధం లేదు" అని చెప్పడాన్ని ఆనం ప్రస్తావించారు. పార్టీలో కీలక నేతగా, వైజాగ్ ఇన్‌ఛార్జ్‌గా పనిచేసిన వ్యక్తి అలా చెప్పడాన్ని ఎలా అర్థం చేసుకోవాలని ప్రశ్నించారు. విజయసాయిరెడ్డి స్కామ్ జరిగిందని ఒప్పుకున్నారంటే, వైసీపీ ప్రభుత్వంలోని ప్రతి నాయకుడికీ అందులో భాగం ఉన్నట్లేనని ఆయన స్పష్టం చేశారు. తమ ప్రభుత్వంలో తప్పు చేస్తే దండించడానికి చంద్రబాబు నాయుడు అనే హెడ్ మాస్టర్ బెత్తం పట్టుకుని ఉంటారని, అందుకే తాము తప్పులు చేయలేమని ఆనం అన్నారు. కానీ, వైసీపీ నేతలు మాత్రం ప్రజల సొమ్ముతో రాజభోగాలు అనుభవించారని మండిపడ్డారు. ప్రజలు ఎన్నికల్లో తిరస్కరించినా వైసీపీ నేతలు ఇంకా అబద్ధాలు చెబుతున్నారని, మాట్లాడే ముందు ఒక్కసారి మనస్సాక్షిని ప్రశ్నించుకోవాలని హితవు పలికారు. గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా ఉన్నందున ఈ ఆరోపణలన్నింటికీ జగన్‌మోహన్‌రెడ్డి సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందని ఆనం వెంకటరమణారెడ్డి డిమాండ్ చేశారు.

# డైపర్లు మార్చినట్లు.. పార్టీలు మార్చేస్తున్నారు

- మొదటి పేజీ తరువాయి

రాజకీయ నాయకులు పార్టీలు మార్చేస్తున్నారు. ఇది ప్రజాస్వామ్యానికి, రాజకీయ గౌరవానికి మంచిది కాదు' అని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు వ్యాఖ్యానించారు. విజయవాడలో బుధవారం 'నమో భారతీయం'

ఆధ్వర్యంలో భాజపా సీనియర్ నాయకుడు వల్లూరు శ్రీమన్నారాయణ ఆత్మీయ అభినందన సభలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కొందరు కార్యకర్తలు స్థాయి మరచిపోయి అసభ్యకరంగా మాట్లాడుతున్నారని ఆక్షేపించారు. కృష్ణా జిల్లా పెనమలూరు మండలం పెదపులిపాక గ్రామానికి చెందిన శ్రీమన్నారాయణ పదవులు ఆశించకుండా నమ్మిన పార్టీ కోసం 56 ఏళ్లుగా పనిచేస్తున్నారని గుర్తుచేశారు.

**జట్కా బండిలో తిరుగుతూ మైకులో చెప్పేవాణ్ని**

'కాలేజీ యూనియన్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు రాత్రి పూట ఖాళీ దొరికితే గోడలపై పార్టీ గురించి రాసేవాడిని. నా మాటలు పొందికగా ఉన్నా.. అక్షరాలు అంత అందంగా ఉండేవి కావు. నిదానంగా అలవాటు చేసుకున్నా. నేను రాజకీయాల్లో చేరినప్పుడు నా వయసు చాలా తక్కువ. వాజ్‌పేయీ, ఆడ్వాణీ, సుందర్‌సింగ్ భండారీ, నానాజీ దేశ్‌ముఖ్ లాంటి వాళ్లు నెల్లూరు వస్తున్నారంటే.. మైకులో జట్కా బండిపై తిరిగి అనౌన్స్ చేసేవాణ్ని' అని వెంకయ్యనాయుడు గుర్తుచేసుకున్నారు. 'ఉప రాష్ట్రపతి అయిన తర్వాత రాజ్యాంగ పదవిలో చేరాను కాబట్టి రాజకీయాలకు దూరమయ్యాను. కానీ నా మనసంతా భాజపా ఉంది' అని పేర్కొన్నారు.

**ఫిజిక్స్ చూసి పెళ్లి చేసుకుని.. కెమిస్ట్రీ కుదరలేదని విడిపోతున్నారు**

భారతదేశంలోని కుటుంబ, వివాహ వ్యవస్థను ప్రపంచమంతా గౌరవిస్తోందని, దాన్ని మనం కాపాడుకోవాలని వెంకయ్యనాయుడు సూచించారు. 'మన కుటుంబ వ్యవస్థలు, వివాహ బంధాలు

దెబ్బతింటున్నాయి. పేరెంట్స్ డే అప్పుడే కొందరికి తల్లిదండ్రులు గుర్తుకొస్తున్నారు. అన్నదమ్ములు కూడా కలిసిమెలిసి ఉండట్లేదు. ఫిజిక్స్ చూసి పెళ్లి చేసుకుని కెమిస్ట్రీ కుదరలేదని విడిపోతున్నారు' అని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్.లక్ష్మీపతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాసరావు, బోడె ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే కుమారస్వామి, నమో భారతీయం వ్యవస్థాపక అధ్యక్షులు జీవీ రామరాజు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల భాజపా అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్, తాతినేని రామచంద్రరావు పాల్గొన్నారు.

# బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తేనే మద్దతు

- మొదటి పేజీ తరువాయి

బీసీలుంటే.. మంత్రిమండలిలో ఎందరు బీసీలున్నారో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పాలి. 50 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఎన్నడైనా బీసీని ప్రధానిని చేశారా? ఉమ్మడి ఏపీలో ఒక్క బీసీనైనా సీఎంగా చేశారా? బీసీని ప్రధాని చేసిన ఘనత భాజపాదే. 27 మంది బీసీ కేంద్ర మంత్రులు, పలు రాష్ట్రాలకు బీసీలను సీఎంగా నియమించింది" అని తెలిపారు.

**స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధికోసమే ధర్నా: రామచందర్‌రావు**

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధికోసమే బీసీ రిజర్వేషన్లపై ధర్నా పేరుతో కాంగ్రెస్ నాటకాలాడుతోందని భాజపా రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచందర్‌రావు విమర్శించారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లపై అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టిన కాంగ్రెస్ అందులో 10% ముస్లింలకు కేటాయించాలని చూస్తోందన్నారు. దీంతో బీసీలకు దక్కేది 32 శాతమే.. బీసీలకు పూర్తిస్థాయిలో 42% రిజర్వేషన్ ఉండాలన్నదే భాజపా ఉద్దేశమని చెప్పారు. కాళేశ్వరాన్ని ఒక కుటుంబం నిర్మించిన ప్రాజెక్టుగానే భావిస్తున్నామని, తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మిస్తే కేంద్రం నుంచి సహకారం అందిస్తామని చెప్పారు.

**కాంగ్రెస్‌వి డ్రామాలు: డీకే అరుణ**

కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ డిమాండ్ చేశారు. ఇచ్చిన మాట ప్రకారం 42% రిజర్వేషన్లు పూర్తిగా బీసీలకే ఇవ్వాలని ఓ ప్రకటనలో కోరారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయి బీసీ రిజర్వేషన్ల పేరిట డ్రామాలు చేస్తోందని విమర్శించారు. 2014లో బీసీలకు 34% రిజర్వేషన్లుంటే.. ఇప్పుడు 32 శాతానికి తగ్గించి, ముస్లింలకు పదిశాతం అదనంగా అమలు చేయాలని కాంగ్రెస్ చూస్తోందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఓ ప్రకటనలో ఆరోపించారు.

## దిగి రాకుంటే.. దిగిపోవాల్సిందే..

గద్దె నుంచి దిగిపోవడం' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ప్రధాని మోదీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. లేకుంటే దీని కోసం ఇక తాము దిల్లీకి రాబోమని, మోదీ గల్లీకి వచ్చినప్పుడు.. అక్కడే నిలదీస్తామని హెచ్చరించారు. తెలంగాణ శక్తి, ప్రజల పోరాట స్ఫూర్తిని తక్కువ అంచనా వేయొద్దని సూచించారు. ఈ కార్యక్రమానికి, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ వస్తారని ప్రకటించినా.. వేరే కార్యక్రమాల వల్ల వారు హాజరు కాలేదు. వారితోపాటు, ప్రియాంకాగాంధీ 'ఎక్స్' వేదికగా స్పందించి మద్దతు పలికారు. వివిధ రాష్ట్రాల కాంగ్రెస్ ఎంపీలు, ఇండియా కూటమి భాగస్వాములైన ఎస్పీ, ఎన్సీపీ (శరద్‌పవార్), డీఎంకే, వామపక్షాల ఎంపీలు పాల్గొని సంఘీభావం ప్రకటించారు. తెలంగాణ నుంచి మంత్రులు, కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ముఖ్య నాయకులంతా ఈ ధర్నాకు హాజరయ్యారు. ఈ కార్యక్రమం నేపథ్యాన్ని సీఎం తన ప్రసంగంలో వివరించారు.దిల్లీలోని జంతర్‌మంతర్‌లో నిర్వహించిన ధర్నాలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. చిత్రంలో వివేక్, షబ్బీర్ అలీ, కొండా సురేఖ, జీవన్‌రెడ్డి, కె.కేశవరావు, పొన్నం ప్రభాకర్, మీనాక్షి నటరాజన్, అడ్లూరి లక్ష్మణ్, మహేశ్‌కుమార్‌గౌడ్, వాకిటి శ్రీహరి, భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ప్రజాప్రతినిధులు తదితరులు

# కేసీఆర్ చెప్పినట్టుగానే జాగృతి ముందుకెళ్లింది

బీసీల కోసం జాగృతి తర పున అనేక పోరాటాలు నిర్వహించబోతు న్నామని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత తెలిపారు. తెలంగాణ అ స్తిత్వం, వన రులు, సాం స్కృతిక వైరుధ్య పరిరక్షణ కోసం ఏర్పాటైనదే జాగృ తి అని చెప్పారు. తెలం గాణ సమయంలో కేసీఆర్ చెప్పినట్టుగా జాగృతి ముందుకె ళ్లిందని తెలిపారు. జయశంకర్ సార్ ఆలోచనలను తు.చ. తప్పకుండా పాటించామని చెప్పారు. జూబ్లీహిల్స్ లోని కార్యాలయంలో ఈరోజు జాగృతి ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. బీసీలను కాంగ్రెస్, బీజేపీ రెండు పార్టీలు మోసం చేస్తున్నాయని కవిత అన్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ధర్నాపై విమర్శలు గుప్పించారు. ఈ ధర్నా వల్ల ఎలాంటి ఉపయోగం లేదని అన్నారు. రాష్ట్రపతి అపాయింట్ మెంట్ తీసుకుని అఖిలపక్షాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఢిల్లీకి తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై అన్ని పార్టీల నేతలకు ప్రభుత్వం లేఖలు రాయాలని చెప్పారు. ఈ నెల 15లోపు జాగృతి నూతన కమిటీల ఏర్పాటు ఉంటుందని కవిత తెలిపారు. జాగృతిలోకి వచ్చేందుకు ఎంతో మంది రెడీగా ఉన్నారని... తమకు అన్ని వర్గాల మద్దతు ఉందని చెప్పారు.

# లిక్కర్ కేసు గురించి ఎవరూ మాట్లాడొద్దు

- మొదటి పేజీ తరువాయి

ఈ కేసులో సిట్ విచారణ జరుపుతోందని... దీనిపై ఎవరూ మాట్లాడవద్దని చెప్పారు. ఇదే సమయంలో కూటమి ఎమ్మెల్యేలకు చంద్రబాబు కీలక సూచన చేశారు. ఎమ్మెల్యేలకు ఈ ఏడాది హాలిడే టైమ్ అయిపోయిందని... ఇకపై అందరూ యాక్టివ్ అయి ప్రజల్లోకి వెళ్లాలని చెప్పారు. క్షేత్ర స్థాయిలోకి వెళ్లి ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి వెళ్లేలా పనిచేయాలని సూచించారు.

మరోవైపు గత ప్రభుత్వ హయాంలో అమలు చేసిన మద్యం విధానం వల్ల రాష్ట్రానికి రూ. 3,200 కోట్ల నష్టం వాటిల్లిందని సిట్ తెలిపింది. ఈ కేసులో 12 మందిని అరెస్ట్ చేశామని... మరో 12 మందిపై నాన్ బెయిలబుల్ వారెంట్లు ఉన్నాయని వెల్లడించింది.

## యూరియా కొరత తీర్చండి..

- మొదటి పేజీ తరువాయి

మంత్రి జేపీనడ్డా, పామాయిల్‌పై సుంకాలను 44%కి పెంచి దేశీయ రైతులను ఆదుకోవాలని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్‌లను అభ్యర్థించారు. దిల్లీలో ధర్నాలో పాల్గొన్న అనంతరం ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో.. ఆయన కేంద్రమంత్రులను వేర్వేరుగా కలిసి వీటిపై వినతిపత్రాలు సమర్పించారు. 'ప్రస్తుతం రాష్ట్రంలో కేవలం 1.09 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలున్నాయి. ఆగస్టు నెలకు కేంద్రం 1.70 లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించింది. దాన్ని తక్షణమే సరఫరా చేయాలి. లేదంటే రైతులు ఇబ్బంది పడే ప్రమాదం ఉంది. ఏప్రిల్ నుంచి జులై వరకు రాష్ట్రానికి రావాల్సిన యూరియాలో 2.10 లక్షల మెట్రిక్‌టన్నుల కొరత ఏర్పడింది. ఆ వాటానుకూడా ఆగస్టు నెల కోటాతోపాటు సరఫరా చేయాలి' అని మంత్రి తుమ్మల కేంద్రమంత్రి నడ్డాను కోరారు. దేశీయంగా ఆయిల్‌పామ్ సాగుచేసే రైతులను ఆదుకోవడానికి విదేశాల నుంచి దిగుమతి చేసుకొనే ముడిపామాయిల్‌పై సుంకాన్ని 44%కి పెంచాలని ఆయన కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్‌ను కోరారు. ఇప్పటివరకు ఉన్న దిగుమతి సుంకాన్ని 27.5% నుంచి 16.5%కి తగ్గించడంవల్ల ఆయిల్‌పామ్ గెలల ధరలు తగ్గి దేశీయంగా ఈ పంట సాగు ప్రోత్సాహానికి అడ్డంకిగా మారినట్లు మంత్రి తుమ్మల కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్ దృష్టికి తీసుకెళ్లారు.

# పారితోషికం ఎంత.. ఎలా... తీసుకున్నారు?

- మొదటి పేజీ తరువాయి

ఈడీ బృందం సుదీర్ఘంగా విచారించింది. ఏ యాప్ కోసం ప్రచారం నిర్వహించారు, అందుకు నిర్వాహకులు ఎంత పారితోషికం చెల్లించారు? ఏ రూపంలో ఆ సొమ్ము తీసుకున్నారు, అందుకు సంబంధించిన ఒప్పందం వివరాలేమిటి.. తదితర ప్రశ్నలను సంధించింది. 'నేను 'ఎ23' యాప్ కోసం ప్రచారం చేశా. అది బెట్టింగ్ యాప్ కాదు. కేవలం గేమింగ్ యాప్ కావడంతోనే ప్రచారం చేసేందుకు అంగీకరించా. గేమింగ్ యాప్‌లు ఐపీఎల్, కబడ్డీ, వాలీబాల్ లాంటి క్రీడలకు స్పాన్సర్ చేస్తున్నాయి. నేను చట్టబద్ధంగానే గేమింగ్ యాప్ కోసం ప్రచారం చేశానని' విజయ్ బదులిచ్చినట్లు, సంబంధిత ఒప్పంద పత్రాన్ని ఈడీ బృందానికి చూపించినట్లు సమాచారం.

**హవాలా కోణంపై ఆరా..**

పారితోషికానికి సంబంధించి విజయ్ చెప్పిన సమాధానంపై.. ఈడీ అనుబంధ ప్రశ్నలు సంధించినట్లు సమాచారం. బెట్టింగ్ యాప్‌ల కోసం సినీనటులు తీసుకున్న పారితోషికంలో ఎక్కువ మొత్తం హవాలా రూపంలోనే చేతులు మారినట్లు ఈడీ అనుమానిస్తున్న నేపథ్యంలోనే ఆ కోణంలో ప్రశ్నల వర్షం కురిపించినట్లు తెలిసింది. ఈ అంశంపై విజయ్ ఇచ్చిన సమాధానాలను పరిగణనలోకి తీసుకున్న ఈడీ..మరింత సమాచారం సేకరించే యోచనలో ఉన్నట్లు సమాచారం. విచారణ అనంతరం విజయ్ మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో వెళ్లిపోయారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, 'గేమింగ్ యాప్‌లకు దేశంలోని చాలా రాష్ట్రాల్లో చట్టబద్ధత ఉండటం వల్లనే ప్రచారం చేశానని విచారణ అధికారులకు చెప్పా. నేను ప్రచారం చేసిన యాప్ తెలంగాణలో ఓపెన్ కాదని కూడా చెప్పా. నా బ్యాంకు లావాదేవీల వివరాలను సమర్పించా' అని వెల్లడించారు. ఇదే కేసులో ఈ నెల 11న నటుడు రాణా, 13న మంచు లక్ష్మి విచారణకు రానున్నారు.

# మంగపేటలో జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు..

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా / ములకలపల్లి ప్రతినిధి, ఆగస్టు 06,** ములకలపల్లి మండలం మంగపేట గ్రామంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ట్రైనీ కలెక్టర్ సౌరబ్ శర్మ తో కలిసి బుధవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. మంగపేట గ్రామంలోని అంగన్వాడి కేంద్రం, ప్రాథమిక పాఠశాల మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు మరియు గర్భిణీ స్త్రీలకు అందిస్తున్న పౌష్టికాహారం తదితర సేవల గురించి అంగన్వాడీ టీచర్ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రంలో ఉన్నటువంటి గుడ్లను మరియు ఇతర ఆహార పదార్థం నిల్వలను పరిశీలించారు. సందర్భంగా కలెక్టర్ అంగన్వాడీ టీచర్ ను సి హెచ్ ఆర్ క్రింద పిల్లలకు ఏ విధమైన పౌష్టికాహారం అందిస్తున్నారు? గర్భిణి స్త్రీలకు ఏ విధమైన పౌష్టికాహారం అందిస్తున్నారు అని అడిగి తెలుసుకున్నారు? గర్భిణీల లో రక్తహీనత లేకుండా చూడాలని, వైద్య సిబ్బంది ద్వారా గర్భిణీలకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలకు పౌష్టికాహారం అందించాలని, గర్భిణీలు, పిల్లలకు వ్యాధినిరోధక టీకాలు ఇప్పించాలన్నారు. అంగన్వాడీ కేంద్రానికి ప్రహరీ గోడ లేకపోవడం వలన కోతులు మరియు పాముల వల్ల ఇబ్బందులకు గురి అవుతున్నామని కలెక్టర్ దృష్టికి అంగన్వాడీ సిబ్బంది తీసుకురాగా, వెంటనే స్పందించిన కలెక్టర్ మట్టి ఇటుకలతో ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టే విధంగా వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

అనంతరం మంగపేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించి, విద్యార్థుల పుస్తక పఠనం మరియు చేతిరాతను కలెక్టర్ పరిశీలించారు. మధ్యాహ్న భోజనానికి సిద్ధంగా ఉన్న ఆహార పదార్థాలను కలెక్టర్ మెనూ ప్రకారం ఉన్నాయా లేదా అని పరిశీలించి సంతృప్తి వ్యక్తం



చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాలలోని తరగతి గదిలలో జిల్లా కలెక్టర్ విద్యార్థులతో ముఖాముఖి ముచ్చటించారు. విద్యార్థుల విద్యాసామర్థ్యంపై పలు ప్రశ్నలు వేసి బోర్డు పై రాయించి విద్యార్థుల సామర్థ్యాన్ని మరియు వారి యొక్క చేతిరాతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు అనంతరం విద్యార్థులకు నోట్ పుస్తకాలు మరియు పెన్నులు బహుకరించారు. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలోప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల ఆరోగ్యం, చదువు అత్యంత ప్రాధాన్యమైనవని అన్నారు. అదేవిధంగా పాఠశాల వసతులు, భోజనం నాణ్యత విషయంలో ఎలాంటి వ్యత్యాసం రావొద్దని ఆదేశించారు. రోజువారి మెనూ పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు.పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులు కింద కూర్చొని ఉండటాన్ని గమనించి పాఠశాలకు త్వరలో అవసరమైన బెంచీలు ఏర్పాటు చేస్తామన్నారు.

మంగపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుల హాజరు, ఓపీ, రిజిస్ట్రేషన్ కౌంటర్,ల్యాబ్,ఇన్ పేషంట్ వార్డు, వ్యాక్సినేషన్ రూమ్ తదితర విభాగాలను తనిఖీ చేశారు. ఔషధ నిల్వలు రిజిస్టర్ను కలెక్టర్ పరిశీలించారు. ఔట్ పేషెంట్ విభాగంలో రోగులకు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని,ఆస్పత్రి పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

ఈ పర్యటనలో కలెక్టర్ వెంట తాసిల్దార్ గన్యా, ప్రధానోపాధ్యాయురాలు కోటమ్మ, అంగన్వాడి టీచర్ సుజాత మరియు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పార్లమెంట్ లో కేంద్రమంత్రులు జెపి నడ్డా మరియు నిర్మలా సీతారామన్ కలిసిన మంత్రి తుమ్మల

- ఆగస్టు నెల కేటాయింపులు మరియు ఏప్రిల్ నుండి జులై వరకు ఏర్పడిన లోటు యూరియాను ఈ నెల కేటాయింపులతో పాటే కలిపి వెంటనే సరఫరా చేయాలని జెపి నడ్డా ని కోరిన మంత్రి తుమ్మల
- క్రూడ్ పామాయిల్ పై దిగుమతి సుంకాన్ని 44 శాతానికి పెంచాలని నిర్మలా సీతారామన్ ని కోరిన మంత్రి తుమ్మల



**సి కె న్యూస్ ప్రతినిధి:**బీసీలకు 43 శాతం రిజర్వేషన్లు కల్పించేలా ఢిల్లీలోని జంతర్ మంతర్ లో ఈ రోజు ధర్నాకు హాజరైన మంత్రి తుమ్మల గారు, పార్లమెంట్ లో కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్రానికి కేటాయింపుల ప్రకారం రావాల్సిన యూరియాను వెంటనే సరఫరా చేయాలని కోరడం జరిగింది. ఏప్రిల్ నుండి ఇప్పటి వరకు యూరియా సరఫరాలో ఏర్పడిన లోటును కూడా ఆగస్టు నెల కేటాయింపులతో పాటే సరఫరా చేసేలా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం రాష్ట్రంలో కేవలం 1.09 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, సరఫరాలో ఆలస్యం తలెత్తితే రైతులు ఇబ్బందులు పడే అవకాశం ఉందని కేంద్ర మంత్రి నడ్డాగారి దృష్టికి తీసుకెళ్లారు. కేంద్ర ప్రభుత్వం ఆగస్టు నెలకు రాష్ట్రానికి 1.70 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించిందని.. కేటాయించిన యూరియాను తక్షణమే సరఫరా చేయాలన్నారు. ఏప్రిల్ నుండి జులై వరకు రాష్ట్రానికి రావాల్సిన యూరియాలో 2.10 లక్షల మెట్రిక్ టన్నులు కొరత ఏర్పడిందని, ఈ యూరియాను కూడా ఆగస్టు నెల కేటాయింపులతో పాటే వెంటనే సరఫరా చేయాలని అన్నారు.

అదేవిధంగా కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ని కలిసి, క్రూడ్ పామాయిల్ పై దిగుమతి సుంకాన్ని మార్చి 2018 లో ఉన్నట్టుగా 44 శాతానికి పెంచాలని కోరడం జరిగింది. క్రూడ్ పామాయిల్ పై దిగుమతి సుంకాన్ని 27.5 శాతం నుండి 16.5 శాతం తగ్గించడం వలన ఆయిల్ పామ్ గెలల ధర తగ్గడంతో పాటు , ఇది ఆయిల్ పామ్ సాగు ప్రోత్సహకానికి అడ్డంకిగా మారనుందని మంత్రిగారి దృష్టికి తీసుకెళ్లారు. ఇంతకుముందుకే దిగుమతి సుంకాన్ని 27.5 శాతం నుండి 44 శాతానికి పెంచాలంటూ రాష్ట్ర ప్రభుత్వం తరపున అభ్యర్థించినట్టు గుర్తుచేశారు. ప్రస్తుతం సాగు సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రాష్ట్రాలు, రైతులకు తగిన ప్రోత్సహకాలు కల్పిస్తూ, ఈ పంట సాగు పెంపుపై దృష్టి సారిస్తున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయంపై మరోసారి పునః సమీక్షించాలని మంత్రి కోరడం జరిగింది. కేంద్ర ప్రభుత్వం ప్రాయోజిత పథకమైన పథకంలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ఆయిల్ ప్లాంటేషన్ ప్రథమ స్థానంలో ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ దిగుమతి సుంకం తగ్గింపు నిర్ణయం వలన రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగు విస్తరణకోసం చేస్తున్న కార్యక్రమాలకు ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందని కేంద్ర మంత్రికి వివరించారు. ఈ విషయాలన్నింటిని దృష్టిలో ఉంచుకొని క్రూడ్ పామాయిల్ పై తగ్గించిన దిగుమతి సుంకాన్ని తిరిగి మరల 44 శాతానికి పెంచాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ని కోరారు. మంత్రితో పాటు భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కూడా పాల్గొన్నారు.

# అన్న వస్త్రాలు కావాలి అన్వాయిుదాలు కాదు.





**సి కె న్యూస్ ఆగస్టు 6 బుధవారం హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ప్రతినిధి కమలాకర్:**ధర్మసాగర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో, ఆగస్టు 6 జన విజ్ఞాన వేదిక ధర్మసాగర్ మండల వార్షిక సభ ప్రధానోపాధ్యాయులు ధర్మ ప్రకాష్ అధ్యక్షతన నిర్వహించారు ."ప్రపంచ శాంతి కోసం సైన్స్ "అను అంశాల నిర్వహించిన ఈ సదస్సులో విద్యార్థులు కవితల ,ద్వారా ఉపన్యాసాల ద్వారా ప్రపంచ శాంతికి మనమంతా కట్టుబడి ఉండాలని తెలిపారు .ఈ సదస్కు ముఖ్యఅతిథిగా, ప్రధాన వక్తగా హాజరైన విశ్రాంత అటవీ అధికారి కాజీపేట పురుషోత్తం మాట్లాడుతూ హిరోషిమా, నాగసాకిలపై అన్వర్థ దాడులు ప్రపంచ మానవ చరిత్రలో అత్యంత విషాదకరమైన సంఘటన. దీనివల్ల వేలాది మంది మానవులు చనిపోవడం అత్యంత బాధాకరం. మానవ అభివృద్ధికి ,సంక్షేమానికి కావాల్సింది అన్న వస్త్రాలు కానీ అన్వాయిదాలు కాదు. శాస్త్ర సాంకేతిక ఫలాలు మానవ ప్రగతికి తోడ్పడాలి కానీ వినాశనానికి కాదు అన్నారు. సదస్సు సమన్వయకర్త సురేష్ భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు జన విజ్ఞాన వేదిక ధర్మసాగర్ మండలంలో గత సంవత్సర కాలంగా చేసిన కార్యక్రమాల నివేదికను తెలిపారు. పాఠశాల సీనియర్ ఉపాధ్యాయురాలు కవితా దేవి మాట్లాడుతూ పాఠశాలల్లో నిర్వహించే ఇలాంటి వైజ్ఞానిక సదస్సులు విద్యార్థుల్లో బాల్య దశలోనే ప్రశ్నించే తత్వము, శాస్త్ర దృక్పదము పెంపొందేలా చేస్తాయని అన్నారు . కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మజ, కిరణ్మయి ,రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో జయశంకర్ సార్ జయంతి వేడుకలు.

## తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్రం ఉపాధ్యక్షులు జోగు అంజన్న సమక్షంలో.



**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు ఆగస్టు 6.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ.

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు జోగు అంజన్న ఆధ్వర్యంలో వలిగొండ మండల కేంద్రంలో తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా జయంతి ఉత్సవాలను నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జయశంకర్ సార్ అహర్నిశలు తెలంగాణ కొరకు కృషి చేసిన వ్యక్తిగా తెలంగాణ ప్రజల గుండెల్లో నిలిచిపోయారని ఆయన తొలిదశ మలిదశ ఉద్యమంలో పాల్గొని ఎన్నో పోరాటాలు చేసి అవమానాలను భరించి తెలంగాణ సాధనకు మార్గదర్శకుడుగా ఉండి విద్యార్థి దశలోనే ఎన్నో పోరాటాలు చేసి ప్రిన్సిపాల్ గా ప్రొఫెసర్ స్థాయికి ఎదిగి తెలంగాణను సాధించడానికి అనునిత్యం కృషిచేసి మహా వ్యక్తి అని తెలంగాణను సాధించడమే ధ్యేయంగా పెట్టుకొని ఆ దిశ గా అడుగులు వేసి తెలంగాణను సాధించడానికి కృషి చేసిన వ్యక్తులలో మొట్టమొదటి వ్యక్తిగా ఆయనను తెలంగాణ ప్రజలు ఎన్నటికీ మర్చిపోరని కొనియాడారు, ఆయన ఆశయాలు కొనసాగించాలని అన్నారు..

ఈ కార్యక్రమంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షులు శీలం స్వామి గౌరవ సలహాదారు కళ్లెం లక్ష్మారెడ్డి సీనియర్ నాయకులు కొండూరు సత్తయ్య కొండూరు శ్రీరాములు దండ మల్లికార్జున్ ఎక్కడ దేవి శ్రీనివాస్ శీలం ఇందిరా మండల మహిళా అధ్యక్షురాలు ఐటిపాముల పుష్ప తదితరులు పాల్గొన్నారు.

# కుప్పెనకుంట్ల బీసీ గర్ల్స్ హాస్టల్ ను పరిశీలించిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్



**సి కె న్యూస్ ప్రతినిధి:** సత్తుపల్లి నియోజకవర్గం పెనుబల్లి మండలం లో కుప్పనకుంట్ల బీసీ గర్ల్స్ హాస్టల్ మధ్యాహ భోజనం ను స్వయంగా పరిశీలించి, విద్యార్థినలతో కలిసి మధ్యాహ భోజనం చేశారు

ప్రతి హాస్టల్ లో ప్రతి రోజు భోజన సమయం లో వంట గదిలో తప్పనిసరిగా పరిశుభ్రత పాటించాలి అని, నాణ్యమైన కూరగాయలు, నిత్యావసర సరుకులు వాడాలి అని వంట మెస్రి కి, ప్రధాన ఉపాధ్యాయులకు మరియు కాంట్రాక్టర్ కు పలు సూచనలు తెలియజేశారు

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం పాఠశాల చిన్నారులకు నాణ్యమైన భోజనం, చదువు అందించాలి అని ఉద్దేశం తో డైట్ చార్జీలు, క్యాస్మోటిక్ చార్జీలు ఎన్నడూ లేని విధంగా ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో పెంచటం జరిగిందాని డాక్టర్ మట్టా దాయనంద్ తెలియజేశారు

ఈ కార్యక్రమం లో పెనుబల్లి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పంది వెంకటేశ్వరరావు,సత్తుపల్లి నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పసుమర్తి విశ్వనాథ్, సత్తుపల్లి ఏ ఎం సి చైర్మన్ దోమ ఆనంద్, కల్లూరు ఏ ఎం సి చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి, వైస్ చైర్మన్ కోటేశ్వరరావు,సీనియర్ నాయకులు టేకులపల్లి శ్రీనివాస్ రెడ్డి, సీతా రాములు, చిన్న స్వామి,చీకటి రామారావు, కరీముల్లా, పెనుబల్లి మండలం, గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా, యూత్, ఎన్ ఎస్ యూ ఐ నాయకులు పాల్గొన్నారు

# ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహానికి నివాళి వర్తించిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు



**సి కె న్యూస్ ప్రతినిధి:**తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి సందర్భంగా నారాయణఖేడ్ మున్సిపల్ పరిధిలో గల ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహానికి బిఆర్ఎస్ పార్టీ నాయకులు పూలమాలవేసి నివాళులు అర్పించారు ఈ సందర్భంగా వారు ప్రొఫెసర్ జయశంకర్ సార్ గారు తెలంగాణ రాష్ట్ర అవతరణ కోసం ఆయన జీవితాన్ని త్యాగం చేశారని కొని ఆడారు.

ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్ నాయక్ మండల పార్టీ అధ్యక్షులు పరమేష్,మాజీ మున్సిపల్ చైర్మన్ నజీబ్,పట్టణ పార్టీ అధ్యక్షులు నగేష్ సెట్ మాజీ ఎంపీటీసీ లు ముజామిల్, భూపాల్, బక్షిరామ్, మండల పార్టీ యువత ఉపాధ్యక్షులు నర్సింలు ముదిరాజ్, నర్సింలు యాదవ్, అధ్యక్షులు మచ్చేందర్, కురుమ సంఘం తాలూకా ఉపాధ్యక్షులు మల్గొండ, మాజీ మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు గోపాల్,నాయకులు సురేష్, అశోక్ రెడ్డి, గణపతి, తదితరులు ఉన్నారు.

# ప్రముఖ ఆంధ్రప్రభ విలేకరి అమ్మ దశ దీన కర్మ కార్యక్రమం లో పాల్గొన్న... డాక్టర్ మట్టా దయానంద్



**సి కె న్యూస్ ప్రతినిధి:**రాజీవ్ కాలనీ – సత్తుపల్లి ప్రముఖ ఆంధ్రప్రభ సీనియర్ రిపోర్టర్ ఖాదర్ బాబా అమ్మ కి " శే " లు షేక్ వలీయాంబీ దశ దీన కర్మ కార్యక్రమం లో పాల్గొని వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించరు ఈ కార్యక్రమం లో సత్తుపల్లి ఏ ఎం సి చైర్మన్ దోమ ఆనంద్ బాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ సుజాల రాణి, మాజీ కౌన్సిలర్ గ్రాండ్ మౌలాలి, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె చెన్నారావు, సీనియర్ నాయకులు చల్లగుల్ల నరసింహ రావు, చల్లగుల్ల కృష్ణ రావు, కమల్ పాషా, సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రి కమిటీ డైరెక్టర్ మొరిశెట్టి సాంబశివరావు, ఎన్ ఎస్ యూ ఐ సత్తుపల్లి నియోజకవర్గం అధ్యక్షులు సందీప్ గౌడ్, హమీద్ మరియు సత్తుపల్లి పట్టణ మరియు మండలం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా, యూత్, ఎన్ ఎస్ యూ ఐ నాయకులు పాల్గొన్నారు..

# తపస్ ఆధ్వర్యంలో ఘనంగాప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు,

**ఆగష్టు 06 ( సీ కే న్యూస్) చేగుంట**

తపస్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని చేగుంట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చేగుంటలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తపస్ మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్ మాట్లాడుతూ

తెలంగాణ ఉద్యమాన్ని గల్లి నుంచి ఢిల్లీ దాకా తీసుకువెళ్లిన గొప్ప వ్యక్తి అని,1969 తెలంగాణ ఉద్యమంలోనూ, అంతకు ముందు నాన్ ముల్కీ ఉద్యమంలో, సాంబార్– ఇడ్లీ గోబ్యాక్ ఉద్యమంలో పాల్గొన్నారు అని, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతపై పలు పుస్తకాలు రచించారు అని, జయశంకర్ జ్ఞాపకార్థం జయశంకర్ జిల్లా ను ఏర్పాటు చేశారు అని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో తపస్ మండల అధ్యక్షులు రావుల వెంకటేష్, తపస్ జిల్లా కార్యదర్శి సుమతి,భవాని, శ్రీనివాస్,రఘుపతి, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



# మాజీ సర్పంచులను మర్యాదపూర్వకంగా కలిసిన బీఆర్ఎస్ నాయకులు లకావత్ గిరిబాబు




**సి కె న్యూస్ ప్రతినిధి:** ఏన్కూర్ మండలం పరిధిలోని భగవాన్ నాయక్ తండా, కోదండరాంపురం తండా గ్రామాలకు చెందిన మాజీ సర్పంచులు గుగులోత్ ప్రసాద్, బోడ వినోద్ లను బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆధ్వర్యంలో మాజీ సర్పంచుల నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులు లకావత్ గిరిబాబు

ఈ సందర్భంగా నాయకులందరితో మాట్లాడారు. త్వరలో జరిగే స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు గెలుపు కోసం కృషి చేయాలని కోరారు, అనంతరం మండల కేంద్రంలో పలు విషయాలపై వారితో చర్చించారు,.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు భుక్యా వినోద్ కుమార్, భుక్యా ధర్మా నాయక్, యూత్ అధ్యక్షులు షైక్ బాజీ, మైనారిటీ అధ్యక్షులు షైక్ చాంద్ పాషా, రేపల్లెవాడ గ్రామ శాఖ రాచబంటి వీరభద్రం, ప్రశాంత్, షైక్ మౌలాలి, నవీన్ తదితరులు పాల్గొన్నారు

# వాజేడు జూనియర్ కళాశాలలో జయశంకర్ జయంతి..

**వాజేడు మండల ప్రతినిధి షేక్ రహీమ్:** తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 91వ జయంతి సందర్భంగా వాజేడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆయన చిత్రపటానికి పుష్ప మాలలు వేసి అంజలి ఘటించారు.

ఈ సందర్భంగా కళాశాల పౌరశాస్త్ర ఉపన్యాసకులు భూక్య రాజు మాట్లాడుతూ

ఆచార్య జయశంకర్ తెలంగాణ ఉద్యమ నిర్మాణానికి చేసిన కృషిని.. ఉద్యమంలో ఆయన చేసిన సిద్ధాంత పరంపరను గుర్తు చేశారు, ఈ కార్యక్రమంలో కళాశాల ఉపన్యాసకులు డా అమ్మిన శ్రీనివాసరాజు,పూరె అవంతి, దూమాల నరసింగరావు, పత్రి కుమారస్వామి, కోడిపెల్లి కాంతయ్య, చల్లగురుగుల రాజ్ కుమార్, పోతురాజు కృష్ణవేణి, మరియు ఏముల రమేష్ విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు,

# వీధి పంపులు మరమ్మత్తులు చేసి మంచినీరు అందించాలి....

- సిసి రోడ్లు, డ్రైన్లు నిర్మించాలి.
- ఆదర్శనగర్ కాలనీలో సమస్యలపై సిపిఎం సర్వే..



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఆగస్టు 06,** ఆదర్శనగర్ కాలనీలో మంచినీటి వీధి పంపులను మరమ్మత్తులు చేసి నీరు అందించాలని, సిసి రోడ్లు,డ్రైన్లు నిర్మించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సున్నం గంగ లు డిమాండ్ చేశారు.. పార్టీ వార్డు కమిటీ ఆధ్వర్యంలో ఆదర్శనగర్ కాలనీలో సమస్యలపై సర్వే నిర్వహించడం జరిగింది. ఈ సర్వే సందర్భంగా కాలనీ ప్రజలు అనేక సమస్యలను నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. ఆదర్శనగర్ కాలనీలో సిసి రోడ్లు, డ్రైన్లు కోసం అనేకసార్లు కొలతల కొలుచుకొని వెళ్లిన అధికారులు నేటికి నిర్మాణం మాత్రం చేపట్టలేదని కాలనీవాసులు వాపోయారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, జిల్లా కమిటీ సభ్యులు సున్నం గంగలు మాట్లాడుతూ ఆదర్శనగర్ కాలనీలో పనిచేయని మంచినీటి పంపులను వెంటనే మరమ్మత్తులు చేపట్టి నీళ్లు అందించాలని, చెడిపోయిన మంచినీటి చేతి పంపు రిపేరు చేయాలని, డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ నిధుల ద్వారా సిసి రోడ్లు, డ్రైన్లు నిర్మించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు. నాగమణి. కాటం ముత్తేశ్వరి. భోగ్గి భద్రమ్మ. దాబా. సత్యం మాదిలా సత్యం భట్టు కుమార్ తదితరులు పాల్గున్నారు

# దశ దిన కర్మ కార్యక్రమంలో పాల్గొన్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు లకావత్ గిరిబాబు..



**సి కె న్యూస్ ప్రతినిధి:** వైరా నియోజకవర్గంలోని ఏన్కూర్ మండలం రేపల్లవాడ మాజీ ఉప సర్పంచ్ మద్దెల పాపారావు మాతృమూర్తి మద్దెల బాపమ్మ దశ దిన కర్మ కార్యక్రమంలో వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులు లకావత్ గిరిబాబు పాల్గొని వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు భుక్యా వినోద్ కుమార్, భుక్యా ధర్మా నాయక్, యూత్ అధ్యక్షులు షైక్ బాజీ, మైనారిటీ అధ్యక్షులు షైక్ చాంద్ పాషా, రేపల్లెవాడ గ్రామ శాఖ రాచబంటి వీరభద్రం, ప్రశాంత్, షైక్ మౌలాలి, నవీన్ తదితరులు పాల్గొన్నారు

# ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద బీసీ రిజర్వేషన్ బిల్లు ధర్నాలో పాల్గొన్నా సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి దయానంద్

**సి కె న్యూస్ ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన బీసీ బిల్లు ను కేంద్రం ప్రభుత్వం ఆమోదించాలి అని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి అందుకు ఢిల్లీ లో తెలంగాణ ప్రజాప్రతినిధులతో కలిసి ధర్నా చేస్తున్న ఎమ్మెల్యే రాగమయి దయానంద్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం బీసీలకు 42% రిజర్వేషన్ ప్రక్రియ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ క్యాబినెట్ మరియు అసెంబ్లీలో బీసీ బిల్లు పెట్టి ఆమోదించడం జరిగింది.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కులగనన చేపట్టి బీసీలకు 42% రిజర్వేషన్ ఇవ్వాలని భావిస్తున్న తరుణంలో బిల్లు కేంద్ర ప్రభుత్వం పెండింగ్లో పెట్టడం జరిగింది, అయినా గాని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం బీసీ సోదరి సోదరీమణులందరూ ఉన్నతమైన స్థానాల్లో ఉండాలని ఆర్డినెన్స్ ద్వారా రిజర్వేషన్ అమలు చేయాలని చూసి క్యాబినెట్ ఆమోదించే గవర్నర్ దగ్గరికి పంపడం జరిగింది. కానీ గవర్నర్ ఆమోదం ఇంకా లభించకపోవడంతో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క , మహేష్ కుమార్ గౌడ్ మీనాక్షి నటరాజ్ మరియు మంత్రులు ఎమ్మెల్యేలు ఎంపీలు ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రదేశ్ కమిటీ సభ్యులు, బీసీ సంఘాల సభ్యులు అందరూ కూడా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదించాలని ధర్నా చేయటం జరుగుతుంది, ఆ తర్వాత ప్రజా ప్రతినిధులు అందరూ కలిసి రాష్ట్రపతి ని కలిసిబీసీ బిల్లు ఆమోదించడానికి సహకరించాలని కోరడం జరుగుతుంది.



# ప్రతి ఒక్కరు వేంకటేశ్వర స్వామి అనుగ్రహం పొందాలి

**వేంకటేశ్వర స్వామి దేవాలయం ప్రారంభోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న నల్లగొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్**



**సి కె న్యూస్ ప్రతినిధి:** ప్రతి ఒక్కరు వేంకటేశ్వర స్వామి అనుగ్రహం పొందాలని నల్లగొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. కొండమల్లెపల్లి మండలం గౌరికుంట తండాలో వేంకటేశ్వర స్వామి దేవాలయం ప్రారంభోత్సవం కార్యక్రమంలో నల్లగొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు..ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుంది అని ఆయన అన్నారు.ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని అని ఆయన అన్నారు.అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ ని సన్మానించారు.ఈ కార్యక్రమంలో మాజీ రైతు బంధు అధ్యక్షులు కేసాని లింగా రెడ్డి,బిఆర్ఎస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు రమావత్ తులిసిరం, మాజీ సర్పంచ్ రమావత్ దీప్ల నాయక్,రమావత్ రమేష్,రమావత్ కృష్ణ,పెద్దిశెట్టి సత్యం, వెంకటయ్య,శివ తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 7న వికలాంగుల చేయూత పెన్షన్ దారుల జిల్లా మహాసభ,పద్మశ్రీ మందకృష్ణ మాదిగ రాకను విజయవంతం చేయండి.

- గంగారపు శ్రీనివాస్ మాదిగ
- ఎం ఎస్ పి జిల్లా అధికార ప్రతినిధి ఎమ్మార్పీఎస్ మండల ఇంచార్జి,

**సీకే న్యూస్ ఆగస్టు 6 బుధవారం హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ప్రతినిధి కమలాకర్:** ఈనెల 7న హసన్పర్తి మండలం చింతగట్టులో ఎంటిఆర్ గార్డెన్ లో వికలాంగుల, చేయూత, పెన్షన్ దారుల పెన్షన్లను పెంచాలని డిమాండ్ చేస్తూ జరుగుతున్న జిల్లా మహాసభకు ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ హాజరవుతారని

గంగారపు శ్రీనివాస్ మాదిగ తెలిపారు ధర్మసాగర్ మండల కేంద్రంలోని మల్లకపల్లి గ్రామంలో తాటికాయల అశోక్ మాదిగ ఎంఎస్ఎఫ్ గ్రామశాఖ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశం లో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన 6 గ్యారంటీలలో ఒకటైన వికలాంగుల , వృద్ధుల , వితంతువుల , ఒంటరి మహిళల , చేనేత , బీడీ , గీత కార్మికుల పెన్షన్లు పెంచుతామని రేవంత్ రెడ్డి మాట ఇవ్వడం జరిగిందని ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని లేనిపక్షంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ పెన్షన్లు తీసుకునే వారికి వికలాంగులు అయితే 4000 పెన్షన్ ఉంటే 6000 చేస్తానని వృద్ధులు , వితంతువులు , ఒంటరి మహిళలు , చేనేత , బీడీ , గీత కార్మికులకు 2000 ఉన్న పింఛన్లు 4000 చేస్తామని నన్ను నమ్మి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొని వస్తే మేము అధికారంలోకి వచ్చిన నెల నుండి పెన్షన్లు పెంచి ఇస్తామని నమ్మించి ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్నా కూడా ఇప్పటికీ ఒక్క రూపాయి పెన్షన్ పెంచకపోగా నాలుగు నెలల పెన్షన్ ఎగ్గొట్టాడని మరియు పెన్షన్ దారులను నమ్మించి మోసం చేశాడని అన్నారు. పెన్షన్లు పెంచి ఇచ్చే వరకు మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో పెన్షన్ దారులందరినీ ఐక్యం చేసి పోరాటం చేస్తామని దానిలో భాగంగానే ఈనెల 13న చలో హైదరాబాద్ లక్షలాది మందితో వికలాంగుల చేయూత పెన్షన్ దారుల మహా గర్జన ఉంటుందని. దాన్ని విజయవంతం చేయడంలో భాగంగా ఈ నెల 7న హసన్పర్తి మండలంలోని చింతగట్టులో గల ఎం టి ఆర్ గార్డెన్లో వికలాంగుల చేయూత పెన్షన్ దారుల జిల్లా మహాసభను నిర్వహిస్తున్నామని ఆ సభకు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ముఖ్యఅతిథిగా విచ్చేసి పెన్షన్ దారులతో మాట్లాడతారని కావున హనుమకొండ జిల్లాలోని 14 మండలాల పరిధిలోని ప్రతి గ్రామం నుండి వందలాదిగా వికలాంగులు , వృద్ధులు , వితంతువులు , ఒంటరి మహిళలు , చేనేత , బీడీ , గీత కార్మికులు పెన్షన్ దారులు , మరియు కండరాల క్షీణతతో పూర్తిగా మంచానికి పరిమితమైన వికలాంగులు అందరూ హసన్పర్తి చింతగట్టు ఎం టీ ఆర్ గార్డెన్లో వేలాది మందితో జరుగు జిల్లా మహాసభకు ప్రతి గ్రామం నుండి విచ్చేసి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.



ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు

సోంపల్లి అన్వేష్ మాదిగ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు, పుట్ట ప్రశాంత్ మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు, సింగారపు పవన్ మాదిగ ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షులు, భారీగల ప్రదీప్ కుమార్ ఎం ఎస్ ఎఫ్ మండల నాయకులు, వృద్ధులు, వికలాంగులు, వితంతువులు ఆరూరి లక్ష్మి, ఆరూరి కొమురయ్య, తాటికాయల ఎస్తేర, జక్కుల కొమురయ్య, గుంపుల బుచ్చి రెడ్డి, సిరికొండ లచ్చమ్మ, బైరాపాక ఆరోగ్యం, బరికల భద్రయ్య, తాటికాయల చేరలు,

రాయితల ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

# కొత్తగూడెం ఏరియాలో ఘనంగా కీ శే శ్రీ ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలు.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఆగస్టు 06,** జనరల్ మేనేజర్ కార్యాలయంలో నిర్వహించి నటువంటి ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏరియా జనరల్ మేనేజర్ ఎం. షాలేం రాజు హాజరైనారు. ముందుగా వారి చిత్రపటానికి పూలమాలవేసి వారికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జి.ఎం మాట్లాడుతూ కీఎశేఎఎ ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 1934 ఆగస్టు 6న వరంగల్ జిల్లా, అక్కంపేట గ్రామంలో జన్మించి తెలంగాణ ప్రజల అభివృద్ధికి తన జీవితాన్ని అంకితం చేశారని, చిన్న వయస్సులోనే ఆయన తిరుగుబాటు భావనను ప్రదర్శించారన్నారు, ఆరో తరగతి విద్యార్థిగా, నిజాం పాలనలో రాజును పొగడే పాటలు పాడమన్న ఆదేశాన్ని తిరస్కరించి వందేమాతరం పాడారని ఇది ఆయన ఉద్యమ జీవితం ప్రారంభమైన ఘట్టం, ఆయన బనారస్ హిందూ యూనివర్సిటీ, అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ, ఉస్మానియా యూనివర్సిటీలలో ఎం ఏ (ఎకనామిక్స్), పిహెచ్డీ , బి .ఇడ్ వంటి విద్యా పట్టాలు పొంది, కేవలం పండితుడు గానే కాక, తెలంగాణ ఉద్యమానికి దారితీసిన దార్శనికుడి గా ఉన్నారు మరియు 1952లో ముల్కీ ఉద్యమం సమయంలోనే ఆయన ఉద్యమంలో పాల్గొన్నారు. తెలంగాణ వెనుకబాటుతనానికి కారణం నీటి పంపిణీ అసమానతలు, ప్రాంతీయ అసమానతలేనని విశ్లేషించారు. తన పరిశోధనలు, ఉపన్యాసాలు, రచనల ద్వారా ప్రజలకు తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం అవసరమని చాటి చెప్పారు. కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్సలర్గా పనిచేసిన సమయంలో విద్యార్థులు, మేధావులను ఉద్యమం లో చేర్చారు. ఆయన కృషితో తెలంగాణ ఉద్యమం ప్రజా ఉద్యమంగా మారింది. ఆయన స్మరణార్థంగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం (పీజేటీసా ) స్థాపించబడింది. ప్రొఫెసర్ జయశంకర్ సాదా జీవితం గడిపారు. పదవులు, అధికారాలు కోరకుండా, ప్రజల కోసం న్యాయం కోరారు. వొదువని ముచ్చట అనే జీవిత చరిత్రలో ఆయన జీవన ప్రయాణం వివరించబడిందని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో జిఎం తో పాటు ఎస్ ఓ టూ జిఎం జివి. కోటి రెడ్డి, కొత్తగూడెం ఏరియా ఏఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ జే గట్టయ్య, ఐఎన్టియూసి వైస్ ప్రెసిడెంట్ ఎండీ రజాక్, ఏరియా ఇంజనీర్ కే. సూర్యనారాయణ రాజు, ఎజిఎం(ఫైనాన్స్) కే. హన సుమలత, డిజిఎం (పర్సనల్) జి.వి. మోహన్ రావు, డిజిఎం(ఐ ఈ) ఎన్. యోహాన్, ఇతర విభాగాల అధిపతులు, జిఎం కార్యాలయ ఫిట్ సెక్రటరీలు కే.సౌజన్య, సిహెచ్. సాగర్, ఇతర అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

# ప్రొ " జయశంకర్ జయంతి కార్యక్రమం లో పాల్గొన్న... డాక్టర్ మట్టా దయానంద్

**సి కె న్యూస్ ప్రతినిధి:** తెలంగాణ సిద్ధాంత కర్త ఆచార్య ప్రొ " జయశంకర్ జయంతి సందర్భంగా ఆ మహనీయుడి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ అనంతరం యూ పి ఎస్ స్కూల్ లో మరియు అంగన్వాడీ భవనం లో పాఠశాల చిన్నారులకు స్వీట్స్ ను అందించారు అనంతరం యూ పి ఎస్ స్కూల్ లో మధ్యాహ భోజనం ను స్వయంగా డాక్టర్ మట్టా దయానంద్ పరిశీలించారు

ఈ కార్యక్రమం లో సత్తుపల్లి ఏ ఎం సి చైర్మన్ దోమ ఆనంద్ బాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ సుజాల రాణి, యూ పి ఎస్ స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాఠశాల చిన్నారులు, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె చెన్నారావు, సీనియర్ నాయకులు చల్లగుల్ల నరసింహ రావు, చల్లగుల్ల కృష్ణ రావు, కమల్ పాషా, సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రి కమిటీ డైరెక్టర్ మొరిశెట్టి సాంబశివరావు మరియు సత్తుపల్లి పట్టణ మరియు మండలం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా, యూత్, ఎన్ ఎస్ యూ ఐ నాయకులు పాల్గొన్నారు..



# వైరా ఎస్సై పి రామారావు ను సన్మానించిన జర్నలిస్టులు

- సేవా కార్యక్రమాల్లో రామారావు కృషి అభినందనీయం: ఏనుగు వెంకటేశ్వరావు



**తల్లాడ సీకే న్యూస్ ప్రతినిధి విజయ్**
వైరా ఎస్సై పి రామారావు తన విధులు నిర్వహిస్తూ సమాజ సేవా కార్యక్రమలలో ఆయన చేస్తున్న సెవలు ఎంతో అభినందనీయమని ప్రజాపక్షం బ్యూరో టి యు డబ్ల్యూ ఐజేయు జిల్లా అధ్యక్షులు ఏనుగు వెంకటేశ్వరావు అన్నారు. తల్లాడ ఆర్బి గార్డెన్ లో జరిగిన కార్యక్రమంలో వైరా ఎస్సై పి రామారావు ను తల్లాడ మరియు ప్రజాపక్షం జర్నలిస్టులు ఘనంగా సన్మానించారు. టి యు డబ్ల్యూ జే ఐ జే యు జిల్లా అధ్యక్షులు ఏనుగు వెంకటేశ్వరావు తల్లాడు ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు బహుదూర్ సీతారాముల మరియు టికే ప్రసన్నన్ తో కలిసి ఘనంగా సన్మానించారు .ఈ సందర్భంగా ఏనుగు వెంకటేశ్వరావు మాట్లాడుతూ ఎస్సై పి రామారావు కృత్రిమ కాలులు ఏర్పాటు విషయంలో ఎంతో చోరీలు చూపుతు ఎంతోమంది వికలాంగులకు అండగా నిలబడి వారు నడిచే విధంగా కాలు ఏర్పాటు చేయడంలో తన వంతు చేస్తున్న కృషి ఎంతో గొప్పదని అలాంటి వ్యక్తులు అరుదుగా ఉంటారని ఆయన అన్నారు .ఈ కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు

## తల్లాడ ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులను సన్మానించిన ఐజేయు జిల్లాఅధ్యక్షులు ఏనుగు వెంకటేశ్వరావు..





**తల్లాడ సీకే న్యూస్ ప్రతినిధి విజయ్:**తల్లాడ మండల ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎండి బహుదూర్, దేవబత్తిని సీతారాములను టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా అధ్యక్షులు ఏనుగు వెంకటేశ్వరావు, వైరా ఎస్సై రామారావు, తల్లాడ తహాసిల్దార్ సురేష్ కుమార్, ఎంపీడీవో సురేష్ బాబు సన్మానించారు. బుధవారం తల్లాడ లోని ఆర్.బి గార్డెన్లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులతో పాటు గౌరవ అధ్యక్షులు టీకే ప్రసన్నన్ కమిటీ బాధ్యులను శాలువాలు పూలమాలతో సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు గొడ్ల బాబురావు, ఇటికల చలపతి గౌడ్, ఇస్నేపల్లి శ్రీనివాస్, ఇనపనూరు కుటుంబరావు, నారపోగు ప్రసాద్, జి నరసింహారావు, గొల్లమందల ప్రేమ్ కుమార్, కొత్తపల్లి విజయ్, కాంపాటి రవి, బానోతు నరేష్, రేగళ్ల శ్రీను, బోనాసీ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## లూర్డుమాత పాఠశాలలో అంగరంగ వైభవంగా జరిగిన వనమహోత్సవ వేడుకలు.




**తల్లాడ, : ఆగస్టు 6 సీకే న్యూస్ ప్రతినిధి విజయ్**
మండల పరిధిలో నారాయణపురం లూర్దుమాత హై స్కూల్ నందు,రాష్ట్రవ్యాప్తంగా పచ్చదనాన్ని పెంచి ఆకుపచ్చని తెలంగాణ రాష్ట్రం చెయ్యాలని లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వన మహెూత్సవ వేడుకలు లూర్దుమాత పాఠశాలలో అంగరంగ వైభవంగా జరిగినాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు లయన్స్ క్లబ్ అధ్యక్షులు కోడూరు నాగేశ్వరరావు, డిస్టిక్ క్యాబినెట కోఆర్డినేటర్ కర్నాటి లక్ష్మారెడ్డి, జోన్ చైర్మన్ బెల్లంకొండ ఆంజనేయులు , లయన్స్ క్లబ్ సభ్యులు మరియు లూర్దుమాత పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ సత్య , ప్రధానోపాధ్యాయులు సిస్టర్ ప్రసన్న , ముఖ్య అతిథులుగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వనమహెూత్సవం ప్రాధాన్యత, పర్యావరణ పరిరక్షణ గురించి ప్రసంగించారు. పాఠశాల విద్యార్థులు చెట్లను నరకడం వల్ల వచ్చే నష్టాలను నాటిక రూపంలో,డాన్స్ రూపంలో ప్రదర్శించి ప్రేక్షకుల మనసును ఆకట్టుకున్నారు. విద్యార్థులందరూ రకరకాల మొక్కలు తెచ్చి నాటారు. స్కూలు ప్రాంగణం అంతా పచ్చదనంతో కలకల్లాడింది.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, తల్లిదండ్రులు ఎంతో ఉత్సాహంతో పాల్గొన్నారు.

# బీసీ ముసుగులో కాంగ్రెస్ మతపరమైన ఆటలు!



- జంతర్ మంతర్‌కు బీసీలు కరువై, పేమెంట్ ప్రదర్శకులు!
- 42% రిజర్వేషన్ అంత నాటకం
- ముస్లింల రిజర్వేషన్‌కి బీసీ ముసుగు
- మీడియా సమావేశంలో భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు

**సి కె న్యూస్ ప్రతినిధి:**తెలంగాణ రాష్ట్రంలో బీసీ హక్కుల పేరిట మత రాజకీయాలకు దారితీసే కుట్రను కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తోందని, బీసీల హక్కులను ముసుగుగా ఉపయోగిస్తూ ముస్లింలకు రిజర్వేషన్ కల్పించాలనే అజెండాతో ముందుకు సాగుతుండటం బాధాకరమని భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మంగళవారం ఖమ్మం బీజేపీ జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన, కాంగ్రెస్ పార్టీ ధర్నా ప్రయోజనాల వెనుక దాగిన అసలైన లక్ష్యాన్ని బహిర్గతం చేశారు.

"డిల్లీలో జంతర్‌మంతర్ వద్ద నిర్వహించిన ధర్నా ఎట్టి పరిస్థితుల్లోనూ బీసీల హక్కుల కోసం కాదు. అది పూర్తిగా ముస్లింలకు రిజర్వేషన్ కల్పించే ప్రయత్నమే. బీసీ రిజర్వేషన్ బిల్లుప్‌తో మతపరమైన వర్గాలకు లాభం చేకూర్చాలన్నదే వారి దుశ్చింతన," అని మండిపడ్డారు.

నిజమైన బీసీ హక్కుల కోసం పోరాటం చేయాల్సిన సమయంలో కాంగ్రెస్ పార్టీ బీసీలను వేదికగా పెట్టుకొని ముస్లింలకు ప్రాధాన్యతనిచ్చే ప్రయత్నం చేస్తోందని ఆయన ఆరోపించారు. "బీసీలకు ఐదు శాతం, ముస్లింలకు పక్కాగా ఇరవై శాతం రిజర్వేషన్ ఇవ్వాలన్న కాంగ్రెస్ విధానం రాజ్యాంగానికి విరుద్ధం. మతపరమైన రిజర్వేషన్ అనేది రాజ్యాంగం స్పష్టంగా నిషేధించింది," అని స్పష్టం చేశారు.

జంతర్‌మంతర్ వద్ద జరిగిన ధర్నాకు బీసీల మద్దతు కరువై, పేమెంట్ ఆర్టిస్టులను తీసుకెళ్లి బంధువుల మధ్య తలెత్తే దయనీయ దృశ్యాలను కనిపించేలా చేశారు. "ఇది బీసీలకు సంఘటన కాకుండా బీజేపీపై కుట్రగా అభివర్ణించాల్సిన స్థితి. కాంగ్రెస్ నేతలు సమాజాన్ని మోసం చేస్తున్నారు," అని విమర్శించారు.

ఒక బీసీని సీఎం చేసిన దాఖలా ఉందా?

బీసీల హక్కులపై పెద్ద గొంతుగా మాట్లాడే కాంగ్రెస్ పార్టీ ఇప్పటి వరకు ఒక్క బీసీ నేతను కూడా ముఖ్యమంత్రిగా చేసిందా? అని ప్రశ్నించారు. "బీసీ లు వాడుకునే వస్తువులుగా మారిపోయారు. పదవులు బీసీలకు ఇవ్వడం కన్నా తమ నేతల కులరాజకీయాలకు మాత్రమే ఉపయోగపడుతున్నాయి," అని మండిపడ్డారు.

బీసీ డిక్లరేషన్ కేవలం మాటల మాయ. బడ్జెట్‌లో దానికి ప్రతిఫలించేదేమీ లేదు. రూ. 20 వేల కోట్ల సబ్ ప్లాన్ హామీ గాలికి వదిలేశారు. ఇది బీసీలను మోసం చేసే అత్యంత ఘోరమైన రాజకీయ వ్యూహం," అని పేర్కొన్నారు.

కేంద్రంలో బీసీ అభ్యున్నతికి బీజేపీ కృషి

బీజేపీ పాలనలో బీసీల అభ్యున్నతి కోసం అనేక ప్రయోజనాత్మక పథకాలు అమలవుతున్నాయని, ప్రధానమంత్రి ముద్రా యోజన, వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రోడక్ట్, బీసీ కార్పొరేషన్ ద్వారా ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలవడం వంటి విషయాలను ఉదహరించారు. "మేం హామీ ఇచ్చిన వాటిని నెరవేర్చే బాటలో ఉంటాం. కాంగ్రెస్‌లా మాటలు చెబుతూ మోసంచేయం," అని ఆయన హామీ ఇచ్చారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ వర్గాలు కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పే రోజు దగ్గర్లోనే ఉందని వ్యాఖ్యానించిన ఆయన, "ప్రజలు కర్రు కాల్చి వాత పెడతారని భయపడి బీసీ రిజర్వేషన్ బిల్లు లేవనెత్తారు. కానీ దాన్ని సీరియస్‌గా తీసుకోనవసరం లేదు. ప్రజలు మోసాల్ని గుర్తించగలరు," అన్నారు.

ఈ సమావేశంలో నాయకులు ఈ వి రమేష్, నల్లగట్టు ప్రవీణ్ కుమార్, ఆల్లిక అంజయ్య, కుమిలి శ్రీనివాసరావు, పమ్మి అనిత,తడుపునూరి రవీందర్ , రుద్రగాని మాధవ్,జ్యోతుల యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

## బుధవారం తల్లాడ పోలీస్ వాహన తనిఖీ నిర్వహణ ...

- నంబర్ ప్లేట్స్ లేని దాదాపు 51 వాహనాలు సీజ్ ...
- ట్రాఫిక్ రూల్స్ అతిక్రమిస్తే చర్యలు కఠినంగా ఉంటాయి...
- ఎస్సై వెంకటకృష్ణ వెల్లడి



**తల్లాడ ఆగస్టు 06,సీకే న్యూస్ ప్రతినిధి విజయ్**
తల్లాడ పోలీస్,బుధవారం తల్లాడ ప్రధాన కూడలిలో వాహనాల తనిఖీ ముమ్మరంగా చేపట్టారు.ఈ వాహనాల తనిఖీ పక్రియలో భాగంగా నంబర్ ప్లేట్స్ లేని వాహనాలు. దాదాపు 51 వాహనాలు పైగా సీజ్ చేసి,కేసు నమోదు చేయడం జరిగిందని తల్లాడ ఎస్సై.వెంకటకృష్ణ తెలియజేశారు..

అనంతరం ఆయన మాట్లాడుతూ వాహనదారులు ముఖ్యంగా ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కలిగి ఉండాలని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ అండ్ రెగ్యులేషన్స్ తప్పనిసరిగా పాటించాలని లేనియెడల చట్టపరమైన చర్యలు తీసుకోవడం అనివార్యమని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వెంకటకృష్ణ,ట్రైనీ ఎస్సై. వెంకటేష్,పోలీస్ సిబ్బంది లక్ష్మణ్,శ్రీనివాసరావు, చెన్నారావు నరసింహారావు,నరేష్, రంజిత్, అజారుద్దీన్,శివారెడ్డి తదితరులు ఉన్నారు.

## తెలంగాణ సాంస్కృతిక ప్రతిభకు జాతీయ గుర్తింపు.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ బూర్గంపాడు ప్రతినిధి, ( సాయి కౌశిక్), ఆగస్టు 06,**జాతీయ స్థాయిలో అమలవుతున్న నూతన జాతీయ విద్యా విధానం 2020లో భాగంగా, రాజస్థాన్ రాష్ట్రంలోని ఉదయ్‌పూర్‌లోని సీసీఆర్టీ (సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్సెస్ అండ్ ట్రైనింగ్) కేంద్రంలో నిర్వహించిన 21 రోజుల జాతీయ ఉపాధ్యాయ శిక్షణా శిబిరంలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన బెస్ట్ ప్రాక్టీస్ ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా నిలిచారు.

ఈ శిక్షణలో వారు తెలంగాణ సాంస్కృతిక సంపదలైన బతుకమ్మ, బోనాలు, తీజ్, సమ్మక్క సారలమ్మ జాతర వంటి పండుగలు కండ్లకు కట్టినట్లు ప్రదర్శించడంతో పాటు జయ జయహే తెలంగాణ అంటూ రాష్ట్ర గీతాన్ని ఆలపిస్తూ ఇతర రాష్ట్రాల ఉపాధ్యాయులను ఉత్సాహపరిచారు. అన్ని రాష్ట్రాల ఉపాధ్యాయులు తెలంగాణ గీతాన్ని జతగా ఆలపించడం గర్వకారణంగా నిలిచింది. ఎఫ్ ఎల్ ఎన్, నిపున్ భారత్, నిస్తా,లిప్ వంటి విద్యా అంశాలపై అవగాహన పెంపొందించడమే కాక, ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్, స్వచ్ఛ భారత్, విలువ విద్య, విద్యలో సాంస్కృతిక సమన్వయంపై పలు మాడ్యూల్స్,ఐసీటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ నీ శిక్షణలో భాగంగా చేసి చూపించడం జరిగింది. పేపర్ మశీ,టెర్రకోట శిల్పకళ, చిత్రకళ,బంధిని డిజైన్లు, పప్పెట్ షోలు, చిత్రకళా ప్రదర్శనలు, సంగీతం-నాట్యం వంటి కళా రూపాలను విద్యా సాధనంగా ఎలా ఉపయోగించాలో అనుభవాత్మకంగా నేర్చుకున్నారు.అలాగే శిల్పగ్రామ్, చిత్తోడ్ ఘడ్ కోట,సిటీ ప్యాలెస్, హల్దీ ఘాటి, సాస్ బహు దేవాలయం, ఏకలింగేశ్వర ఆలయం వంటి చారిత్రక ప్రదేశాలను, విద్యా సంస్థలను సందర్శించి రాజస్థాన్ లో అమలవుతున్న విద్యా విధానం ను పరిశీలించడం జరిగింది.ఈ శిక్షణలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలానికి చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మోరంపల్లి బంజర లోని ఉపాధ్యాయుడు మోహన్ తన బెస్ట్ ప్రాక్టీస్‌ను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు.ఆయనతో పాటు ఉమా మహేశ్వర రావు, ఓదెలు, పవిత్ర, శంకర్, మహమ్మద్ షఫీ,ఇర్షాద్ అలీ, ఆచరిత, సీతల్ ఉత్తమ ప్రతిభను ప్రదర్శించారు. తెలంగాణ సత్తాను జాతీయ స్థాయిలో గళం వినిపించడం జరిగింది. సీసీఆర్టీ ఉదయపూర్ ఫీల్డ్ ఆఫీసర్ అభిజిత్ సర్కార్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ముగింపు సమావేశం లో సీసీఆర్టీ ఛైర్మన్ డా.వినోద్ నారాయణ, డిప్యూటీ డైరెక్టర్ డా. రాహుల్ కుమార్,సీసీఆర్టీ న్యూ డిల్లీ ఫీల్డ్ ఆఫీసర్ చంద్రమౌళి శిక్షణ విజయవంతంగా పూర్తి చేసిన ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు అందజేశారు.

## నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామంలో ఫంక్షన్ హాల్ స్థలంకై వినతి.

**భద్రాచలం సబ్ కలెక్టర్‌కు విజ్ఞప్తి.**

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఆగస్టు 06,**బూర్గంపాడు మండలం, నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామానికి చెందిన ప్రజలు తమ గ్రామంలో ఒక ఫంక్షన్ హాల్ స్థలం కొరకు సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ కి విజ్ఞప్తి చేశారు. గ్రామంలో ఫంక్షన్ హాల్ లేకపోవడం తో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

గ్రామంలో పెళ్లిళ్లు, శుభకార్యాలు, ఇతర ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించడానికి సరైన స్థలం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామ ప్రజలు తమ వినతి పత్రంలో పేర్కొన్నారు. ఫంక్షన్ హాల్ అందుబాటు లో ఉంటే అది గ్రామాభివృద్ధికి ఎంతగా నో తోడ్పడుతుందని, గ్రామంలోని ప్రతి కుటుంబానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వారు వివరించారు.

ప్రజా ప్రతినిధుల మద్దతు గ్రామ ప్రజల తరపున ఈ వినతి పత్రాన్ని సమర్పించిన వారిలో బూసిరెడ్డి శంకర్ రెడ్డి (మాజీ రోటరీ గవర్నర్), కుందురు శ్రీనివాసరెడ్డి, రెడెం రవీందర్ రెడ్డి, రెడెం కోటి రెడ్డి, పిల్లలమరి సుధాకర్, సమర సింహ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ, గ్రామంలో ఫంక్షన్ హాల్ అవశ్యకత చాలా ఉందని, దీని నిర్మాణానికి సబ్ కలెక్టర్ తగిన స్థలాన్ని కేటాయించి సహాయం చేయాలని కోరారు.

భవిష్యత్తుకు ఆశ

ఈ విజ్ఞప్తిని పరిశీలించి, గ్రామ ప్రజల కష్టాలను తీర్చడానికి త్వరగా స్థలాన్ని కేటాయించాలని సబ్ కలెక్టర్ గారిని వారు సవినయంగా కోరారు.



## కమ్యూనిస్టు పోరాట యోధుడు అయోధ్య మృతి

- సూర్యాపేట హైవేలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి
- నివాళులర్పించిన సిపిఐ రాష్ట్ర, జిల్లా నేతలు
- అయోధ్య మృతి ప్రజాఉద్యమాలకు తీరని లోటు :
- సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా.




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్)ఆగస్టు 06,**భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ బి.అయోధ్య బుధవారం తెల్లవారుజామున సూర్యాపేటలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. హైదరాబాదులో వైద్యం చేయించుకొని గురువారం జరగనున్న రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పాల్గొనేందుకు వెళుతుండగా ప్రమాదానికి గురై అయన మృతిచెందారు, డ్రైవర్ రమేషకు తీవ్రగాయాలయ్యాయి. సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సిపిఐ కార్యాలయం 'శేషగిరిభవన్'కు పార్టీ శ్రేణుల సందర్శనార్థం తరలించారు. సిపిఐ, ప్రజా సంఘాలు, వివిధ రాజకీయపక్షాల నాయకులు అయోధ్య మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సంతాప సభలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీయాల్లో కమ్యూనిస్టు నేతగా ప్రత్యేక స్తానం సంపాదించుకున్నాడని, జిల్లా రాజకీయాలను శాశించే స్థాయికి కమ్యూనిస్టు పార్టీని తీసుకెళ్లాడన్నారు. మణుగూరు ప్రాంతంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని కమ్యూనిస్టు పార్టీని నిలిబెట్టి, కార్యకర్తలకు అండగా నిలిచారన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిషత్ వైస్ చైర్మన్గా, ప్రజాప్రతినిధిగా పనిచేసి ప్రజలకు యెనలేని సేవలందించారన్నారు. ప్రజా పోరాటాలకు, భూపోరాటాలకు అయోధ్య నాయకత్వం వహించారన్నారు. భద్రాద్రి జిల్లా కమ్యూనిస్టు పార్టీ ఒక బలమైన నాయకున్ని కోల్పోయిందని, అయోధ్య మృతి ప్రజా ఉద్యమాలకు, కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటని, అయన ఆశయాలకు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం కొత్తగూడెం పట్టణ పురవీధులమీదుగా భారీ ఊరేగింపుతో విడ్కోలు పలికారు. నివాళిలర్పించిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకులు అన్నవరపు కనకయ్య, మైనార్టీ సంఘాల రాష్ట్ర నాయకులు నయీమ్ ఖురేషి, మాస్ లైన్ జిల్లా కార్యదర్శి ముద్ద బిక్షం, కాంగ్రెస్ నాయకులు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, చంద్రగిరి శ్రీనివాసరావు, సలిగంటి శ్రీనివాస్, కంచర్ల జమలయ్య, వీసంశెట్టి పూర్ణచందర్ రావు, భూక్యా దస్రు, వాసిరెడ్డి మురళి, యు.రాహుల్, ఎస్ కె ఫహీమ్, జిల్లా సమితి సభ్యులు దమ్మాలపాటి శేషయ్య, జి వీరాస్వామి, మునిగడప వెంకటేశ్వరరావు, గెద్దాడు నగేష్, భూక్యా శ్రీనివాస్, కోమారి హన్మంతరావు, జక్కుల రాములు, పద్మ, ధనలక్ష్మి, దార శ్రీను, అబిద్, తదితరులు పాల్గొన్నారు.

# పాలస్తీనా ప్రజలకు అండగా నిలబడదాం

- ఆగస్టు 7న ఖమ్మం లో జరిగే నిరసన ర్యాలీని జయప్రదం చేయండి..
- న్యూడెమోక్రసీ నేత గొర్రెపాటి రమేష్

**సి కె న్యూస్, తిరుమలాయపాలెం.** గాజా లో పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ దాడులను నిరసిస్తూ గాజా ప్రజలకు సంఘీభావంగా ప్రజలు ప్రజాస్వామిక వాదులు మేధావులు ఆగస్టు 7న ఖమ్మం లో జరిగే ర్యాలీలో పాల్గొని జయప్రదం చేయాలని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ తిరుమలాయపాలెం మండల కార్యదర్శి గొర్రెపాటి రమేష్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ దేశం గత 22 నెలలుగా మారణ హోమాన్ని సృష్టిస్తూ పాలస్తీనా దేశ భూభాగాన్ని తమ చేతిలోకి తీసుకోవాలని అమెరికా అధ్యక్షుడు ట్రంపు సహకారంతో పాలస్తీనా దేశంపై మారణహోమాని సృష్టిస్తుందని ముమ్మాటికీ అప్రజాస్వామీకం దేశంలో ఒక దేశం పై యుద్ధం చేయటం అది ప్రజల పైన చిన్న పిల్లల పైన యుద్ధం చేయటం సరికాదని తక్షణమే యుద్ధాన్ని ఆపి శాంతిని కోరుకోవాలని పాలస్తీనా ప్రజలకు అండగా నిలబడదామని కోరుతూ నేడు ఖమ్మంలో ప్రజాస్వామ్య మేధావులు వివిధ పార్టీల ఆధ్వర్యంలో విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో వేలాది మందితో నిరసన కార్యక్రమం చేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమం స్థానిక పెవిలియన్ గ్రౌండ్ నుండి పాత కలెక్టరేట్ ఆఫీస్ వరకు జడ్పీ సెంటర్ అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ ఉంటుందని ఈ ర్యాలీలో ప్రజలు ప్రజాస్వామ్యవాదులు బాధ్యతగా పాల్గొని పాలస్తీనా ప్రజలకు అండగా నిలబడదాం అని కోరుతున్నాం.




# బర్త్ సర్టిఫికెట్ అడిగితే డెత్ సర్టిఫికెట్ ఇచ్చారు

**కూసుమంచి తహశీల్దార్ కార్యాలయంలో అధికారుల తీరు**

**ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మండల ప్రజలు**



**సి కె న్యూస్ ప్రతినిధి:** సర్టిఫికెట్ ఇష్యూ చేసిన సంఘటన కూసుమంచి తహసీల్దార్ కార్యాలయంలో చోటు చేసుకుంది. గట్టుసింగారం గ్రామానికి చెందిన కదారి మాద విద్య అనే బాలిక బర్త్ సర్టిఫికెట్ కోసం పుట్టిన ఆరు నెలల తరువాత దరఖాస్తు చేసుకోగా పంచాయతీలో రికార్డులు లేనందున తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోమని పంచాయతీ కార్యదర్శి చెప్పారు. కాగా సదరు బాలిక తల్లిదండ్రులు సంవత్సరం క్రితం బాలిక బర్త్ సర్టిఫికెట్ కోసం తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేశారు. అప్పటి నుండి అవి సరిగా లేవు.. ఇవి సరిగా లేవంటూ సెక్షన్ అధికారి గువ్వల వెంకటేశ్వర్లు కాలయాపాన చేశారు.

ఆగస్టు 4 వ తేది బర్త్ సర్టిఫికెట్ కోసం కార్యాలయానికి వెళ్లగా బర్త్ సర్టిఫికెట్ తహసీల్దార్ కార్యాలయం ముద్ర వేసి మరి చేతికి అందించాడు. బాలిక తల్లి మమత సర్టిఫికెట్ ను కాసేపాగి ఫోన్లో ఫోటో తీసుకున్న అనంతరం పరిశీలించగా.... బర్త్ సర్టిఫికెట్ బదులు డెత్ సర్టిఫికెట్ ఇచ్చినట్లు గమనించింది. బాలిక తల్లి అధికారిని ఇది ఏమిటని అడుగగా వెంటనే ఆమె దగ్గర నుండి లాక్కొని చించి వేశాడు. మరల బర్త్ సర్టిఫికెట్ అందించాడు. కానీ అందులో ఎక్కడ డెలివరీ అయినా వివరాలు నమోదు చేయలేదు.

అది పంచాయతీ సెక్రటరికి చూపించగా హాస్పిటల్ వివరాలు మరల నమోదు చేపించాలని కార్యాలయానికి వచ్చి సార్ మా సర్టిఫికెట్లో హాస్పిటల్ వివరాలు నమోదు చేయమని అడిగితే నేను నీకు ఇది ఇవ్వడమే ఎక్కువ, అసలు నేను నీకు బర్త్ సర్టిఫికెట్ ఇవ్వను. తహసీల్దార్ ను వెళ్లి అడుక్కో పో అంటూ ఆమెను తీవ్రంగా మందలించాడు. దీనితో వారు తహసీల్దార్ ను కలవడానికి వెళ్లగా తహసీల్దార్ రవి కుమార్ కోర్టు పని ఉండి కార్యాలయంలో అందుబాటులో లేకపోవడంతో ఇంటికి వెళ్లారు. సదరు బాలిక తల్లి మమత ఇటువంటి తప్పులు చేసి మరల పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చిన ప్రజలను ఇష్టం వచ్చినట్లు దుషించే పేరు గువ్వల వెంకటేశ్వర్లు వంటి అధికారుల పై సత్వరమే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలో ఖమ్మం క్రీడాకారుల హవా



- 45 పథకాలు సాధించి రాష్ట్రంలో మొదటి స్థానం
- కోచ్ మరియు క్రీడాకారులను ఘనంగా సన్మానించిన జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**సి కె న్యూస్ ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 11వ తెలంగాణ రాష్ట్ర స్థాయి జూనియర్ మరియు సీనియర్ విభాగంలో అథ్లెటిక్స్ చాంపియన్ షిప్స్ ను ఈ నెల 3,4వ తేదిలలో హనుమకొండ లో నిర్వహించటం జరిగింది. అందులో ఖమ్మం ఎస్ ఏ టి జి అకాడమి అథ్లెటిక్స్ క్రీడకారులు మరియు ఖమ్మం జిల్లా క్రీడాకారులు పాల్గొని 23 బంగారు, 11 రజిత మరియు 11 కాంస్య పతకాలు మొత్తం 45 పతకాలు గెలుపొంది. రాష్ట్రంలో అన్ని జిల్లాల కంటే ఎక్కువగా పతకాలు సాధించి మన జిల్లా ఓవరాల్ టీం ఛాంపియన్ షిప్ ను సాదించింది.

ఈ సందర్భంగా పతకాలు సాదించిన జిల్లా క్రీడాకారులను కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడా అదికారి తుంబూరు సునీల్ రెడ్డి మరియు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు యం. వెంకటేశ్వర్లు, కార్యదర్శి యం.డి. షఫీక్ అహ్మద్ ఉపాధ్యక్షులు శ్రీ. ఎన్. వెంకటేశ్వర్లు మరియు కోచ్ యం.డి గౌస్ పాల్గొన్నారు.

అలాగే పతకాలు సాదించిన క్రీడాకారులను తీర్చిదిద్దిన కోచ్ యం.డి గౌస్ ని కలెక్టర్ సన్మానించినారు. అంతేకాకుండా పతకాలు సాదించిన క్రీడాకారులను మరియు కోచ్ ను భవిష్యత్తులో జాతీయ స్థాయి లో అనేక పతకాలు సాదిస్తూ అంతర్జాతీయ స్థాయిలో దేశానికి ప్రాతినిధ్యం వహించి ఒలింపిక్స్ లో పాల్గొని పతకాలు సాదించి దేశానికి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు.

# ప్రతి నియోజకవర్గంలో ఎమ్ ఎస్ ఎమ్ ఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నాం



- మధిర నియోజకవర్గం లో రెండు పారిశ్రామిక పార్కులకు ఆర్థిక సహాయం అందించండి
- కేంద్ర మంత్రి జితేంద్ర మాంజిని కలిసి విజ్ఞప్తి చేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు

**సికె న్యూస్ ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్రం ఎమ్ ఎస్ ఎమ్ ఈ (మైక్రో, చిన్న మరియు మధ్యతరః పరిశ్రమల)రంగ అభివృద్ధిలో మరో అడుగు ముందుకు వేస్తోంది, రాష్ట్రంలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించేందుకు రెండు కొత్త %మీావీజు% పార్కులను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందనీ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు కేంద్ర ఎమ్ ఎస్ ఎమ్ ఈ మంత్రి జితన్ రామ్ మాంజీ కి వివరించారు. బుధవారం ఉదయం ఢిల్లీలో కేంద్ర మంత్రిని డిప్యూటీ సీఎం తో పాటు పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఎంపీ మల్లు రవి , కలిసి విజ్ఞప్తి చేసి లేఖను అందించారు.

ఎమ్ ఎస్ ఎమ్ ఈ రంగం సమగ్ర ఆర్థిక ప్రగతికి కీలక క్షేత్రంగా మారుతుందని అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం తరపున, ఖమ్మం జిల్లా మధిర మండలంలోని యెండపల్లి, ఎర్రుపాలెం మండలంలోని రె మిడిచర్ల గ్రామాల్లో ఎమ్ ఎస్ ఎమ్ ఈ పార్కులను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించాం, వరుసగా 85 ఎకరాలు మరియు 60 ఎకరాల్లో ఈ పార్కులు అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు డిప్యూటీ సీఎం కేంద్ర మంత్రికివివరించారు. జాతీయ రహదారి 65 (హైదరాబాద్%-%విజయవాడ కారిడార్)కు సమీపంలో ఉండటంతో, వీటి భౌగోలిక స్థానం వ్యూహాత్మకంగా ఉంది. సమీప పట్టణాలు, రైల్వే నెట్వర్క్లు, పోర్టులతో అనుసంధానం ఉందనీ తెలిపారు. ఈ పార్కుల అభివృద్ధి ద్వారా ఆ ప్రాంత యువతకు, ముఖ్యంగా ఎస్సీ వర్గాలకు చెందిన యువతకు పారిశ్రామిక అవకాశాలు అందుబాటులోకి వస్తాయి. ఈ పార్కులు వివిధ తయారీ రంగాలకు అనుకూలంగా అభివృద్ధి చేయబడి, కనీసం 5,000 ప్రత్యక్ష మరియు 15,000 పరోక్ష ఉపాధి అవకాశాలు కల్పించగలవనే అంచనాలతో ఏర్పాటు చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం కేంద్ర మంత్రికి వివరించారు.

ఎమ్ ఎస్ ఎమ్ ఈ-సిడిపి పథకం కింద ఈ పార్కుల అభివృద్ధికి ఆర్థిక సహాయానికి ప్రాజెక్ట్ ప్రతిపాదనలు పంపించేందుకు ముందస్తు అనుమతి ఇవ్వాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం లేఖల కోరింది.

తెలంగాణలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక ఎమ్ ఎస్ ఎమ్ ఈ పార్క్ %-% రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదన ఎమ్ ఎస్ ఎమ్ ఈ-సిడిపి పథకం కింద కేంద్ర నుంచి ఆర్థిక సహాయం ఆశిస్తున్నట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు కేంద్ర మంత్రికి తెలిపారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎమ్ ఎస్ ఎమ్ ఈ రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రతిష్టాత్మక ప్రణాళికను రూపొందించింది. రాష్ట్రంలోని ప్రతి ఒక్క అసెంబ్లీ నియోజకవర్గంలో (మొత్తం 119) చిన్న స్థాయి ఫ్లాటెడ్ ఫ్యాక్టరీలతో కూడిన ఎమ్ ఎస్ ఎమ్ ఈ పార్క్ను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకుందనీ, ఈ పార్కులు, చిన్న స్థాయి పారిశ్రామిక సంస్థలు తమ వ్యాపారాలను ప్రారంభించి, నడిపించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తూ అనుకూలమైన పారిశ్రామిక వాతావరణాన్ని అందించనున్నాయి అని కేంద్రమంత్రికి తెలిపారు.

ఈ ఎమ్ ఎస్ ఎమ్ ఈ పార్కుల్లో హాస్టళ్లు, కిచెన్లు, టాయిలెట్లు, టెస్టింగ్ సెంటర్లు, ఇతర సాధారణ వసతులు ఉంటాయి. వ్యాపార అభివృద్ధి, ఉత్పత్తి ఆవిష్కరణ, మార్కెట్ వ్యూహం వంటి సేవలు అందుబాటులో ఉంటాయి. మహిళా ప్రాధాన్యత గల సంస్థలకు ప్రోత్సాహంగా స్త్రీనిధి పథకం ద్వారా రుణాల మద్దతు కూడా ఇవ్వనున్నామని కేంద్రమంత్రికి వివరించారు. దీని ద్వారా మహిళల ఆధ్వర్యంలోని సంస్థలు బలోపేతం కావడంతోపాటు, జీవనోపాధి అవకాశాలు విస్తరించనున్నాయి.

ప్రస్తుతం ఎమ్ ఎస్ ఎమ్ ఈ-సిడిపి పథకం కింద తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే 25 ప్రాజెక్టులను కేంద్ర ఎమ్ ఎస్ ఎమ్ ఈ మంత్రిత్వశాఖ సహకారంతో అమలు చేస్తోంది. వీటిలో ఇండస్ట్రియల్ పార్కులు, ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్సులు, కామన్ ఫెసిలిటీ సెంటర్లు (సి ఎఫ్ సి ఎస్) ఉన్నాయి. ఇవి రాష్ట్రంలో ఎమ్ ఎస్ ఎమ్ ఈ వ్యవస్థను బలంగా నిలబెట్టడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి.

ఈ క్రమంలో, తెలంగాణ రాష్ట్రం కేంద్ర ఎమ్ ఎస్ ఎమ్ ఈ మంత్రిత్వశాఖ మద్దతుతో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రత్యేకంగా ఎమ్ ఎస్ ఎమ్ ఈ పార్కులను నెలకొల్పడానికి సంబంధిత పథకాల ద్వారా ఆర్థిక సహాయం కోరుతోంది. ఈ ప్రయోజనాత్మక కార్యక్రమాల ద్వారా భారతదేశం లక్ష్యంగా పెట్టుకున్న 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ దిశగా తెలంగాణ రాష్ట్రం కీలక భాగస్వామిగా నిలుస్తుందనే నమ్మకాన్ని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు కేంద్ర మంత్రి ఎదుట వ్యక్తం చేశారు.

# తెలంగాణ సిద్ధార్థ కర్త ఆచార్య కొత్తపెల్లి జయశంకర్ గారి జయంతి వేడుకలు




**సి కె న్యూస్ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ రంజిత్ :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నగర మున్సిపాలిటీ కార్యాలయం నందు తెలంగాణ ఉద్యమ పితామహుడు, ఉద్యమ నాయకుడు ప్రొఫెసర్ కె. జయశంకర్ గారి వర్ధంతి సందర్భంగా నాగారం మున్సిపాలిటీ కార్యాలయంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ శ్రీ భాస్కర్ రెడ్డి గారు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రొ. జయశంకర్ గారి చిత్రపటానికి కమిషనర్తో పాటు మున్సిపల్ అధికారులు, సిబ్బంది పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కమిషనర్ శ్రీ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో జయశంకర్ గారి చేసిన సేవలు వెలకట్టలేనివని అమూల్యమైనవని ఆయన ఆశయాలను స్పూర్తిగా తీసుకొని మున్సిపాలిటీ పరంగా ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి ప్రయత్నిస్తున్నాం, అని ఈ సందర్భంగా తెలిపార ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ మేనేజర్ శ్రీ సురేష్ రెడ్డి, రెవెన్యూ అధికారి బి. నాగేశ్వరరావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. జయశంకర్ గారి సేవలను వారు గుర్తు చేసుకుంటూ ఆయన చూపిన మార్గంలో కొనసాగుతామని ప్రతిజ్ఞ చేశారు

# బాల్య స్నేహితుని కుటుంబానికి అండగా నిలిచిన స్నేహితులు,

**బాసం రాజుశెట్టి కుటుంబానికి అండగా 1991-92 బ్యా చ్ స్నేహితులు**



**ఆగష్టు 06 ( సీ కే న్యూస్) చేగుంట**

రాజు కుటుంబ సభ్యులకు రెండు లక్షల రూపాయల బ్యాంకు బాండ్స్ అందజేసిన స్నేహితులు

రాజు కొడుకు 4, 5 తరగతి చదువులకు పూర్తి బాధ్యత

29 వేలతో రెండు సంవత్సరాలు కుటుంబానికి హెల్త్ పాలసీ సర్టిఫికెట్

చేగుంట. చేగుంట గ్రామానికి చెందిన భాసం రాజుశెట్టి అనారోగ్యంతో మరణించిన విషయం తెలుసుకున్న తన చిన్ననాటి స్నేహితులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి తమవంతుగా రెండు లక్షల రూపాయల బ్యాంక్ బాండు పత్రాలను మరియు రెండు సంవత్సరాలకు సంబంధించిన హెల్త్ పాలసీ కి 29 వేల రూపాయలు, రాజు కూతురు చదువు కోసం 4,5తరగతి లకు ఫీజు పూర్తి బాధ్యత తీసుకుంటామని రాజు స్నేహితులు తెలిపారు. తన మధ్యలో ఉన్న రాజు అకాల మరణం తమను ఎంతో బాధ కలిగించిందని అతని కుటుంబానికి అండగా ఉండాలని ఉద్దేశంతో 1991-92 స్నేహితులందరం కలిసి తమ వంతు సహాయంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో లిఅయిత పరంజ్యోతి, దాసోజి కృష్ణ, గడ్డమీది సిద్ధిరాములు, చాకలి శంకర్, అయిత అరవింద్, చందా రమేష్, తడుపునూరి మహేష్, పాల వేణు, గందె ప్రశాంత్, ఏఎన్ఎం నాగమణి, కూన సంతోష్, కాచం పూర్ణచందర్, కిరాణం సిద్ధిరాములు, గీతాంజలి సిద్ధిరాములు, లుక్క సంతోష్, బిక్షపతి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి ప్రదాత ఆచార్య కొత్తపల్లి జయశంకర్...

**అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి**



**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, ఆగస్టు -06:** తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి ప్రదాత ఆచార్య కొత్తపల్లి జయశంకర్ అని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి అన్నారు.

అదనపు కలెక్టర్, కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో బుధవారం ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆచార్య జయశంకర్ జీవిత చరిత్రకు సంబంధించిన ముఖ్యమైన ఘట్టాలను జిల్లా అధికారులు స్మరించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతిని రాష్ట్ర పండుగ లాగా నిర్వహిస్తున్నామని, ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో వారి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళు లర్పిస్తున్నామని తెలిపారు.

తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సమయంలో ఆచార్య జయశంకర్ పాత్ర మరువలేనిదని, తెలంగాణ ఉద్యమానికి మార్గదర్శకంగా, వెన్నెముకగా ఆచార్య జయశంకర్ నిలిచారని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు.

ఆచార్య కొత్తపల్లి జయశంకర్ కు తెలుగు, ఉర్దూ, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో మంచి ప్రావీణ్యం ఉందని, స్వరాష్ట్ర సాధన కోసం తన జీవితాన్నే అంకితం చేసారని, వారి ఆశయాల సాధన కోసం మనమంతా సమిష్టిగా కృషి చేయాలని అదనపు కలెక్టర్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో సిపిఓ ఏ. శ్రీనివాస్, జిల్లా సాంఘీక సంక్షేమ శాఖ అధికారి కె. సత్యనారాయణ, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ శ్రీలత, జిల్లా ఉపాధికల్పన అధికారిణి ఎన్. మాధవి, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏ.ఓ. కె. శ్రీనివాసరావు, సబ్ ట్రెజరీ అధికారి వేలాద్రి, వివిధ కార్యాలయాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

